

కల్తీ చేస్తే కఠినచర్యలు

- కాలం చెల్లిన, కల్తీ సరుకుల అమ్మకాలపై ఆరోపణలు
- జిల్లా కేంద్రంలో అధికారుల విస్తృత తనిఖీలు
- రికార్డుల పరిశీలన, శాంపిల్స్ సేకరణ

9

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

www.andhrajyothy.com

నిర్మల్

గురువారం 3 ఆగస్టు 2017



20



'భగీరథ' ప్రక్షాళన

8

- రెండు సర్కిల్‌లుగా గ్రిడ్ విభజన
- పనుల పర్యవేక్షణ పనుల వేగం కోసం మార్పులు
- ఇక ఆదిలాబాద్, మంచిర్యాల్ సర్కిల్‌లు మాత్రమే
- నాలుగు జిల్లాల్లో ఈఈ కార్యాలయాల ఏర్పాటు
- గడువులోగా పనుల పూర్తికి కొత్త సంస్కరణలు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మిషన్ భగీరథ పనులను గడువులోగా పూర్తి చేసి తన హామీని నిలుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాటర్‌గ్రిడ్‌లను విభజించి వికేంద్రీకరణ చర్యలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటి వరకున్న నిర్మల్ సర్కిల్‌ను ఆదిలాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ పరిధిలోకి మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. నిర్మల్‌లో ఇక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. అలాగే కొమురంభీం జిల్లా, మంచిర్యాల జిల్లాలను కలిపి మంచిర్యాల కేంద్రంగా మరో కొత్త సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ రెగ్యులర్ ఎస్ఈ ఇక నుంచి ఆదిలాబాద్, నిర్మల్ గ్రిడ్ పనులను పర్యవేక్షించనుండగా, మంచిర్యాల్ ఎస్ఈ ఆసిఫాబాద్, మంచిర్యాల గ్రిడ్‌ల పనులను పర్యవేక్షించనున్నారు. మొత్తం నాలుగు జిల్లాలకు గాను ప్రతీ జిల్లాకు ఒక ఈఈని, డివిజన్‌కు ఒక డిఈని నియమించారు. ఈ వికేంద్రీకరణ ద్వారా ఇక వాటర్ గ్రిడ్ పనులు వేగవంతంగా జరగనున్నాయని సంబంధిత అధికార యంత్రాంగం ఆశిస్తోంది. ఆంధ్రజ్యోతి, నిర్మల్

భైంసా ఏరియా ఆసుపత్రి వాణిజ్య


సముదాయంలో అక్రమాలు



- 15 సంవత్సరాల క్రితం ముగిసిన అద్దె కాల పరిమితి
- నేటికీ జరగని టెండర్ల ప్రక్రియ
- అధికశాతం బినామీలే
- రూ.2 కోట్లకు పైగా పేరుకపోయిన అద్దె, వడ్డీ బకాయిలు

3

కరుణించని వరుణుడు




వర్షం లేక ఎండుతున్న పత్తిమొక్క

- పత్తి రైతుకు అగ్ని పరీక్ష
- ఎండుముఖం పడుతున్న పత్తి
- దిగులు చెందుతున్న రైతులు

9

నత్తనడకన గొర్రెల పంపిణీ



- జిల్లా మొత్తం 14,442 మంది లబ్ధిదారులు
- మొదటి విడతగా 7,148 మందికి ఇవ్వాలని నిర్ణయం
- జిల్లాలో 300 యూనిట్లు మాత్రమే పంపిణీ

9

ఇంటర్వ్యూ I.N.T.E.R.V.I.E.W

విద్యాభివృద్ధికి కృషి

● మంచిర్యాల జిల్లా విద్యాధికారి రవికాంత్‌రావు



మందమర్రి : **మంచిర్యాల జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేసి, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతామని డీఈఓ రవికాంత్‌రావు చెప్పారు. ఈమేరకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.**

ఆంధ్ర జ్యోతి: జిల్లాలో ఎన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి? వాటిలో విద్యాబోధన ఎలా సాగుతున్నది?

అధికారి: జిల్లాలో 671 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా విద్యాబోధన సాగుతున్నది. ఈమేరకు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాం. జిల్లాను విద్యాభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడంతో పాటు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వం పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడం లేదనే ఆరోపణలున్నాయి?

అదికారి: ప్రతి ప్రభుత్వపాఠశాలలో మెనూ ప్రకారం, విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. వారానికి మూడు రోజులు కోడిగుడ్లు అందజేస్తున్నాం. కూరగాయలతో కూడిన భోజనం పెట్టేలా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచిస్తున్నాం. మెనూ పాటించని భోజన నిర్వాహకులపై అవసరమైతే చర్యలు తీసుకుంటాం. జిల్లావ్యాప్తంగా 51వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో హరితహారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారా?

అధికారి: జిల్లావ్యాప్తంగా హరితహారంలో భాగంగా పాఠశాలల్లో 15వేల మొక్కలు నాటాలని మాకు లక్ష్యం విధించారు. ఇప్పటికే 13,500 మొక్కలను నాటాము. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే విధంగా హరితదళాలను(గ్రీన్ బ్రిగేడ్) ఏర్పాటు చేశాం. ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక బ్రిగేడర్ ఉంటారు. వీరి ఆధ్వర్యంలో మొక్కలకు నీరు పోయడంతోపాటు వాటిని పెంచి పెద్దచేస్తారు.

ఆంధ్రజ్యోతి : జిల్లావ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరం ఎన్ని పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు అనుమతిచ్చారు?

అధికారి : జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 30కి పైగా ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్లబోధనకు అనుమతులు ఇచ్చాం. విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు ఆంగ్ల బోధన కొనసాగుతుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు బోధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మందమర్రిలో కేకే-5, ఫిల్టర్‌బెడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సమష్టి కృషి ఫలితంగా పెద్దసంఖ్యలో ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రస్తుతం 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం కూడా మరికొన్ని పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు అనుమతిస్తాం.



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పురుగుల మందు ప్రభావానికి గురైతే

● ప్రాథమిక చికిత్స తప్పనిసరి..

పంటచేలకు పురుగుల మందు పిచికారీ చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవా లి. లేదంటే విషప్రభావానికి లోనయ్యే ప్రమాదముంటుంది. పురుగుల మందులు త యారయ్యే కర్మాగారాలు, నిల్వ ఉండే గిడ్డంగుల్లో పనిచేసే కార్మికులతో పోలిస్తే, పంట చేలకు పిచికారీ చేసే రైతులపైనే అధిక ప్రభావం పడుతుంది. సరైన రక్షణ చర్యలు తీసుకోకపోతే తక్షణం, దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ క్రమంలో మందుల పిచికారీ సందర్భంగా విషప్రభావానికి లోనైన వ్యక్తికి అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి భైంసా ఏడీఏ అమరేశ్‌కుమార్ వివరించారు.

- భైంసా

● చర్మం ద్వారా..

పంట చేలపై మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై పడితే చర్మం ద్వారా విషపదార్థం లోపలికి చొచ్చుకుపోతుంది. పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా ప్రవేశిస్తుంది.

● ముక్కు ద్వారా..

పురుగుమందులు పిచికారీ చేస్తున్నప్పుడు వెలువడే రసాయనాలు, గాలిలో కలుస్తాయి. ఇది ముక్కు ద్వార నేరుగా శరీరంలోకి ప్రవేశించి హానిచేస్తుంది.

● నోటి ద్వారా ..

పురుగుమందులను ముట్టుకున్నప్పుడు లేదా వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి. సబ్బుతో బాగా కడిగాకే ఆహారపానీయాలు తీసుకోవాలి. పైనపైన కడిగి తినప్పుడు పురుగుమందు అవశేషాలు నోటి ద్వారా శరీరంలోపలికి వెళ్తాయి. తద్వారా ఒక్కోసారి మరణం కూడా సంభవిస్తుంది.

● ప్రథమ చికిత్స..

చర్మం మీద పురుగుల మందు పడినప్పుడు వెంటనే శుభ్రమైన నీరు, సబ్బుతో పలుమార్లు కడుక్కోవాలి. కంటిలోపడినప్పుడు కూడా జాగ్రత్తగా నీటితో శుభ్రం చేసుకోవాలి. చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. బట్టలపై పడినప్పుడు ఉతికి శుభ్రం చేసిన తర్వాతే ధరించాలి.





● ముక్కు ద్వారా పురుగుల మందు శరీరంలోకి వెళ్లినప్పుడు గాలి ధారాళంగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాసతీసుకోవడం కష్టమైనా, పూర్తిగా ఆగిపోయినా వెంటనే కృత్రిమ శ్వాస ఇవ్వాలి. ఆరోగ్యకరమైన వ్యక్తి ఎవరైనా తన నోటి ద్వారా బాధితుడి నోటిలోకి గాలిని ఊది ఊపిరిపోయొచ్చు. విష ప్రభావానికిలోనైన వ్యక్తిని వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.

● నోటి ద్వారా విషం ప్రవేశించినప్పుడు లక్షణాలను బట్టి వెంటనే వాంతి చేయించాలి. గ్లాసు వేడి నీళ్లలో ఒక స్పూను ఉప్పు లేక ఆవాలపొడి కలిపి తాపించాలి. గొంతులో వేళ్లు పెట్టి కక్కించాలి. కడుపులోని పదార్థం ఖాళీ అయ్యే దాకా ఇలా చేస్తూనే ఉండాలి. 8 గ్రాముల చార్‌కోల్, 4 గ్రాముల మెగ్నీషియం ఆక్సైడ్ రసాయనాలను అరగ్లాసు వేడి నీళ్లలో కలిపి తాగించాలి. పాలు, గుడ్డులోని తెల్లసొనా ఇస్తే జీర్ణాశయం లోపలి భాగానికి హాని కలగదు. వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే జీర్ణాశయం, చిన్నపేగులను వీలైనంత శుభ్రం చేసి, చికిత్స అందిస్తారు.

ఆధ్యాత్మికం

గూడెం ఆలయంలో ప్రత్యేక పూజలు..



కొలువు దీరిన శ్రీసత్యదేవుడు

● గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సుప్రబాతం, ఆరాధన, బాలబోగము.

● ఉదయం 7 గంటల నుంచి ధర్మదర్శనము, స్వామి తీర్థప్రసాదం వితరణ అర్చకుల పూజలు

● మధ్యాహ్నం 12:15 గంటలకు స్వామివారికి మహానివేదన, హారతి, మంత్రపుష్పం.

● గూడెం దేవస్థానాన్ని మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు మూసివేస్తారు.

● ఆ సమయంలో ఆలయ కౌంటర్లు, కార్యాలయాలు కూడా మూసి ఉంటాయి.

● సాయంత్రం 6 గంటల నుంచి స్వామి వారికి బోగము, హారతి, మంత్రపుష్ప నివేదన.

● రాత్రి 7 గంటల సమయంలో గూడెం ప్రధానాలయం మూసివేస్తారు.

శ్రీసత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఇలా..

● శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాల మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటలకు, రెండో బ్యాచ్ ఉదయం 11గంటలకు, మూడో బ్యాచ్ సాయంత్రం 3.30 గంటల నుంచి నిర్వహిస్తారు. వ్రతం ఆచరించే భక్తులు పూలు పండ్లు, కొబ్బరికాయలు, మంగళహరతిప్లేటు, మాణిక్యాలు, చెంబు, గ్లాస్‌ను వెంటతెచ్చుకోవాల్సి ఉంటుంది. మిగిలిన సామూహిక వ్రత పూజా సామగ్రి ఆలయంలోనే అందజేస్తారు.

Employee Voice

ఉద్యోగి వాయిస్

3ఆర్ఎస్ విధానం అమలుతో విద్యార్థులకు ఇక్కట్లు

- టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు పోగుల భూమయ్య



శ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సామర్థ్యం, అవగాహన పెంపుదలకై చేపట్టిన 3ఆర్ఎస్(రీడింగ్, రైటింగ్, రివిజనింగ్)వల్ల విద్యార్థులకు సిలబస్ కుంటుపడుతుంది. ఈ కార్యక్రమం మంచిదే అయినప్పటికి విద్యా సంవత్సరం మధ్యలో 60పని దినాల్లో కార్యక్రమం నిర్వహించడం వల్ల ఇంకా అకాడమిక్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు గందరగోళంలో ఉన్నారు. డిజిటల్ తరగతులకు ఇబ్బంది కలుగుతుంది. 6-9తరగతుల విద్యార్థుల సిలబస్ వెనుకబడుతుంది. దీనివల్ల సమ్మెటివ్ అసెస్‌మెంట్1పై తీవ్ర ప్రభావం పడుతుంది. 1నుంచి 5వ తరగతులు కలిగిన పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించి ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితే ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుంది. అప్పుడు ఉన్నత పాఠశాలల్లో ఈ అవసరం ఉండదు.

భైంసా ఆసుపత్రి వాణిజ్య సముదాయంలో అక్రమాలు

- 15 సంవత్సరాల క్రితం ముగిసిన అద్దె కాల పరిమితి
- రూ.2 కోట్లకు పైగా పెరుకుపోయిన అద్దె
- పట్టించుకోని అధికారులు

భైంసా: అధికార, పాలక వర్గాలు అనుసరిస్తున్న లోపాయికారి విధానాలను అసరగా చేసుకుంటున్న భైంసా ఏరియా ఆసుపత్రి వాణిజ్య సముదాయంలోని అద్దెదారులు అంతులేని అక్రమాలకు పాల్పడుతున్నారు. నియమ,నిబంధనలు ఉల్లంఘిస్తూ పదిహేను సంవత్సరాలుగా రాజ్యమేలుతున్నారు. ప్రతీ మూడు సంవత్సరాలకోసారి టెండర్లు నిర్వహించి అద్దెలు పెంచాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏరియా ఆసుపత్రిలో నిర్మించిన 10 దుకాణాలకు 1997 సంవత్సరములో టెండర్లు నిర్వహించి మూడు సంవత్సరాల కాల పరిమితితో అగ్రిమెంట్ చేసి కేటాయించారు. అధికార, పాలక వర్గాలు మారినప్పటికీ అద్దెదారులు వారందరిని మచ్చిక చేసుకొని తమ వ్యాపార లావాదేవీలకు ఎలాంటి విఘాతం లేకుండా చూసుకుంటున్నారు. లోపాయికారి విధానాలతో తమ అక్రమాలకు అడ్డు,అదుపు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

1997 సంవత్సరములో టెండర్లు..

ఇక్కడి ఆసుపత్రిలోని వాణిజ్య సముదాయంలోని 10 దుకాణాలకు 1997 సంవత్సరములో టెండర్ ప్రక్రియ నిర్వహించారు. ఇందులో 1వ నెంబర్ దుకాణాన్ని జి.ప్రవీణ్ కుమార్ , 2వ నెంబర్ దుకాణాన్ని జి.శ్రీహరి, 3వ దుకాణాన్ని జి.జగదీష్,4వ దుకాణాన్ని ఎం.రాజారామ్, 5వ దుకాణాన్ని కే.సుభాష్, 6వ దుకాణాన్ని సమీనా యాస్మిన్, 7వ దుకాణాన్ని రాజేష్ బచ్చువార్, 8వ దుకాణాన్ని సయ్యద్ ఇక్బాల్, 9వ దుకాణాన్ని ఎజాజ్ ఆహ్మద్, 10వ దుకాణాన్ని నరేష్‌లు టెండర్ల ద్వారా దక్కించుకున్నారు. ఒక్కో దుకాణం ఒక్కో అదెతో మూడు సంవత్సరాల కాల పరిమితితో అగ్రిమెంట్ చేసుకున్నారు. దీని ప్రకారం అద్దెలు ప్రతీ నెల సక్రమంగా చెల్లించని పక్షంలో 18 శాతం వడ్డీ చెల్లించాలనే నిబంధనలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఇప్పటి వరకు సంబంధిత దుకాణాలకు ఎలాంటి టెండర్ ప్రక్రియ జరుగలేదు. 1997 సంవత్సరములో జరిగిన టెండర్ల ద్వారా దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు మరుసటి ఎలాంటి అగ్రిమెంట్ లేకుండానే 15 సంవత్సరాలకు పైగా కాలం నుంచి ఆసుపత్రి వాణిజ్య సముదాయంలో తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు.

బినామీ అద్దెదారులే అధికం..

ఆసుపత్రి వాణిజ్య సముదాయంలోని దుకాణాల్లో బినామీ వ్యాపారులే అధికంగా ఉన్నారు. అగ్రిమెంట్‌లో ఒకరు ఉండగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు మరొకరు ఉన్నారు. అంతేకాకుండా అగ్రిమెంట్‌లో పేర్కొన్న వ్యాపారానికి బదులుగా మరో రకం వ్యాపారాన్ని చేపడుతున్నారు. 1వ దుకాణంలో అగ్రిమెంట్‌లో జి.ప్రవీణ్ కుమార్ ఉండగా దాసరి సత్యనారాయణ అనే వ్యక్తి కిరాణ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 2వ దుకాణం జి.శ్రీహరి అనే వ్యక్తి పేరుపై అగ్రిమెంట్ ఉండగా ఇందులో అశోక్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. 3వ దుకాణం జి.జగదీష్ అనే వ్యక్తి పేరుపై అగ్రిమెంట్ ఉండగా అంజయ్య అనే వ్యక్తి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. 4వ దుకాణం ఎం.రాజారామ్ అనే వ్యక్తి పేరుపై ఉండగా ఇందులో సురేష్ అనే వ్యక్తి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 6వ దుకాణం సమీన యాస్మిన్ అనే మహిళ పైరుపై అగ్రిమెంట్ ఉండగా ఇందులో రాజేందర్ అనే వ్యక్తి వ్యాపారం చేస్తున్నాడు. 7వ దుకాణంలో రాజేష్ బచ్చువార్ పేరుపై ఉండగా సంపత్ అనే వ్యక్తి, 8వ దుకాణం సయ్యద్ ఎక్బాల్ పేరు మీద ఉండగా ఇందులో మహారాష్ట్రకు చెందిన అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి, 9వ దుకాణం ఎజాజ్ ఆహ్మద్ పేరు మీద ఉండగా ఇందులో దిలిప్ అనే వ్యక్తి, 10వ దుకాణం నరేష్ పేరు మీద అగ్రిమెంట్ ఉండగా ఇందులో అశోక్ అనే వ్యక్తి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 8వ దుకాణంలో అగ్రిమెంట్‌లో పేర్కొన్న ప్రకారం జనరల్ స్టోర్ నిర్వాహించాల్సి ఉండగా ఇందులో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ఫుట్‌వేర్ షాప్‌ను కొనసాగిస్తున్నాడు. 10వ నెంబర్ దుకాణంలో అగ్రిమెంట్ ప్రకారం క్లాత్ స్టోర్ నిర్వాహించాల్సి ఉండగా ఇందులో అశోక్ అనే వ్యక్తి మెడికల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. 6 దుకాణాలు రూ.5700 పైగా అద్దెతో ఒక దుకాణం రూ.4885తో మరో రెండు దుకాణాలు రూ.3200తో 10వ నెంబర్ దుకాణం అతి తక్కువ ధర రూ.2225తో అద్దెదారులు దక్కించుకున్నారు. అయితే బినామి వ్యాపారులకు దుకాణాలను అప్పచెప్పిన అద్దెదారులు మాత్రం నెలకు రూ.12,500 పైగానే అద్దెలు వసూలు చేస్తున్నారని సమాచారం.



జనరల్ స్టోర్‌కు బదులుగా చెప్పుల దుకాణాన్ని నిర్వహిస్తున్న అద్దెదారులు



క్లాత్ స్టోర్‌కు బదులుగా నిర్వహిస్తున్న మెడికల్ దుకాణం

రూ.2 కోట్లకుపైగా పేరుకుపోయిన బకాయిలు..

ఆసుపత్రి వాణిజ్య సముదాయానికి సంబంధించి దుకాణాల అద్దెలు సక్రమంగా చెల్లింపులు జరుగడం లేదు. ఆసుపత్రి నిర్వాహణాధికారులతో పాటు సలహా సంఘం కమిటీ సభ్యులు నిస్తేజమైన రీతిలో వ్యవహరిస్తుండటం మూలంగా అద్దెదారులు, బినామిలు సంవత్సరాల తరబడి చెల్లింపులు చేపట్టడం లేదు. దీంతో రూ. 2కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి.

వడ్డీ మాఫీకి సిఫారసు..

దుకాణాలకు సంబంధించి గత సంవత్సరం అక్టోబర్ మాసం వరకు వడ్డీ రూ.2,16,63,852కు పేరుకపోయాయి. అయితే సంబంధిత వడ్డీ మాఫీ విషయంలో అద్దెదారులు ఆసుపత్రి సలహా సంఘం కమిటీలోని ఇద్దరు సభ్యుల కుటుంబీకులతో రాయభా(బే)రాలు జరిపినట్లుగా సమాచారం. ఒక సభ్యురాలి చిన్న కుమా రుడు, మరో సభ్యురాలి భర్త ఈ ఘట్టంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

అద్దె బకాయిలు వసూలు చేస్తాం..

(విఠల్ రెడ్డి, ఎమ్మెల్యే, చైర్మెన్, ఆసుపత్రి సలహా సంఘం,భైంసా)

ఆసుపత్రి వాణిజ్య సముదాయంలోని దుకాణాలకు సంబంధించి అద్దెలు, వడ్డీ బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు చేస్తాం. అద్దెదారులకు నోటీసులు జారీ చేయాలని ఆసుపత్రి నిర్వాహణాధికారులకు ఆదేశించాం. చెల్లించని పక్షంలో అర్‌అర్ అండ్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకునే దిశగా వ్యవహరిస్తున్నాం.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- 400 లీటర్ల బెల్లం పానకం , 5 లీటర్ల గుడుంబా స్వాధీనం

దస్తూరాబాద్ : నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలంలోని ఎర్రగుంట తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో అక్రమంగా గుడుంబా తయారీ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా దస్తూరాబాద్ ఎస్ఐ కోదాడి రాజు మాట్లాడుతూ గుడుంబా తయారు చేయవద్దని దానితో కుటుంబాలు చిన్నభిన్నమవుతాన్నారు. గుడుంబా తయారు చేయడం మానేస్తే ప్రభుత్వం వారికి రూ. 2లక్షల రూపాయల రుణం అందిస్తుందన్నారు. గుడుంబాను తయారు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ బాల కిషన్, లింగయ్య, ఎక్సైజ్ సిబ్బంది భీంరావు, సంతోష్, విశ్వనాథ్, పోలీస్ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లంపానకం

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

భైంసారూరల్ : నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఏల్వి గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. బాధిత కుటుంబీకులు, తానూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాసారపు జలప్ప(45) అనే వ్యక్తి ఉదయం ఇంట్లో బా త్రూంలో స్నానం చేశాడు. అక్కడే ఉన్న విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తానూర్ ఏరియా పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. మృతుడికి ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉట్నూర్ : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్‌కు చెందిన యువకులకు ఇద్దరు ఉట్నూర్ పట్టణ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. జైనూర్ నుంచి గుడిహత్నూర్‌కు ద్విచక్రవాహనంపై ఎక్స్‌రోడ్డు నుంచి ఉట్నూర్ వైపు వస్తుండంగా ఉట్నూర్ సమీపంలోని పూలాజీ బాబా స్కూల్ వద్ద ఉన్న మూలమలుపు వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఇరువురికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్సలు నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రంలోని రి మ్స్‌కు తరలించారు. వారికి ఎటువంటి ప్రాణాపాయం లేదని ఎస్సై మంగీలాల్ తెలిపారు.

బేలలో స్వీట్ దుకాణాల తనిఖీ

బేల: ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో ఉన్న పలు స్వీట్ దుకాణాలను బుధవారం ఎస్సై నరేష్‌కుమార్ అకస్మీకంగా తనిఖీ చేశారు. నిల్వ ఉన్న పదార్థాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేదీ గడువు ముగిసిన వస్తువులు దుకాణాల్లో ఉంచరాదన్నారు. ఉంచినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూనె, చక్కెర, మైద తదితర పదార్థాలను పరిశీలించారు. లైసెన్సులు లేని వారు లైసెన్సులు చేసుకోవాలన్నారు. ఈ తనిఖీలో కానిస్టేబుల్ లక్ష్మణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మన గ్రోమోర్‌లో వ్యవసాయాధికారుల తనిఖీలు

ఖానాపూర్ : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌లో బుధవారం వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం సుర్జాపూర్ గ్రామానికి చెందిన రైతు బక్కశెట్టి వెంకట్రాములు కొనుగోలు చేసి కోరమాండల్ 20 - 20 013 అ ను అడుగు మందు బస్తాల్లో మట్టిపెల్లలు వచ్చాయ ని నిర్వహకులకు సూచించారు. ఈ విషయమై పత్రిక ల్లో వార్తలు రావడంతో అధికారులు సంబంధిత ఎరువు బస్తాలను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. మందు బస్తాల నుంచి శాంపిల్స్‌ను సేకరించారు. పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆసం రవి తెలిపారు. పరీక్షల్లో కల్తీ జరిగినట్లు తెలితే నిర్వహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంబంధి త కంపెనీకి చెందిన 440 బస్తాలను తిరిగి కంపెనీకి తిప్పి పంపించాలని గ్రోమోర్ నిర్వాహకులకు వ్యవసాయాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ వ్యవసాయ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

సోన్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

సోన్: మండల కేంద్రంలోని సోన్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ కృష్ణ ప్రసాద్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం ఈ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. పనులను త్వరలో నాణ్యతయుతంగా నిర్వహించడంతో పాటు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్, సంతోష్, నరేష్‌లున్నారు.

‘ప్రాణహిత చేవెళ్ల పరిహారం ఎప్పుడిస్తారు?’

దిలావర్‌పూర్: ప్రాణహిత చేవెళ్ల ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఎప్పుడిస్తారని దిలావర్‌పూర్ ఎంపీటీసీ సౌజన్య వీరేష్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన జేసీ శివలింగయ్యను ప్రశ్నించారు. పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని. పరిహారం చెల్లింపులను ఎందుకు జాప్యం చేయాల్సి వస్తుందని అడాగారు. ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఇచ్చిన గడువులోగా ఎలాంటి అభ్యంతరాలు రాని పక్షంలో వెంటనే పరిహారం చెల్లింపుల ప్రక్రియ మొదలు పెడతామని జేసీ శివలింగయ్య చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే పరిహారం అందుతుందన్నారు.

టీ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

నిర్మల్‌టౌన్: టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు మురళి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6న జిల్లా కేంద్రంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సుధాకర్‌రెడ్డిలు హాజరవుతున్నారన్నారు. ఈ దినోత్సవానికి జిల్లాలోని వివిధ మండలాల బాధ్యులు ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మిప్రసాద్ రె డ్డి, వెంకట్‌రమణారెడ్డి, నాగభూషణం, తొడిశెట్టి రవికాంత్, పరమేశ్వర్ రెడ్డి, శంకర్, కిషన్, ప్రవీణ్‌రెడ్డి, రవికిరణ్, సునీల్‌రెడ్డి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యతను వెలికి తీయండి

నిర్మల్‌కల్చరల్: పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికి తీయాలని డీఈవో పరీక్షల ఇన్‌ఛార్జి పూదరి జనార్ధన్ పిలుపునిచ్చారు. బుధవారం పీఈటీలు, పీఈడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాల్లో 14 లోపు 17 లోపు విద్యార్థులకు క్రీడా పోటీల్లో పాల్గొనేలా సంసిద్ధులను చేయాలన్నారు. అన్ని రకాల ఆటలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రంగంలోను జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నఫెఖాన్, పేటా అధ్యక్షుడు భుక్య రమేష్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి సుభాష్, పీఈటీలు, పీఈడీలు పాల్గొన్నారు.

‘ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంపు’

లక్ష్మణచాంద: ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పెంచినట్లు ఎంపీడీవో శకుంతల తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, అందుకు సంబంధించిన దరఖాస్తు నకలును ఎంపీడీవో కార్యాలయంలో అందచేయాలని కోరారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

‘పశువుల షెడ్ నిర్మాణానికి నిధుల మంజూరు’

నర్సాపూర్(జి): మండలంలోని డొంగూర్‌గాం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల రేకుల షెడ్డు నిర్మాణానికి రూ. 50వేలు నిధులు మంజూరు కాగా వాటి పనులను అసిస్టెంట్ పీడీ శ్రీనివాస్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మొదట పునాది పనులకు గాను 800 మంజూరు చేస్తామని శ్రీనివాస్ తెలిపారు. పనులు ప్రారంభించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యం, వెంకటేశ్, రైతులు రమేష్, సాయన్న, మల్లారెడ్డిలు ఆయన వెంట ఉన్నారు.



సినిమా గైడ్ నిర్మల్

తిరుమల: దండుపాళ్యం-2

వేంకటేశ్: గౌతమ్‌నందా

నారాయణ: ఫిదా

బీసీల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

● బీసీ మహా సభ రాష్ట్ర కార్యదర్శి సాయన్న

నిర్మల్‌స్పోర్ట్స్: జిల్లాలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంఘం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని, ప్రభుత్వం బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర కార్యదర్శి వై. సాయన్న డిమాండ్ చేశారు. బుధవారం టీఎన్‌జీవో సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలు తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్కటి పరిష్కరించలేదన్నారు. 2014 సంవత్సరం నుంచి 2017 వరకు బీసీలకు రుణాలు మంజూరు చేయలేదన్నారు. అదే విధంగా 2018 బీసీ రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించకపోవడం విచారకరమన్నారు. రుణాలు మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ బీసీలు తిరుగుతున్నా ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదన్నారు. అదే విధంగా నిరుపేద బీసీలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూంలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. నర్సయ్య, ఠాగూర్ రవీందర్‌సింగ్, రాజన్న, రమేష్, విశాల్‌గౌడ్‌లున్నారు.


మాట్లాడుతున్న సాయన్న

వికలాంగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి..

నిర్మల్‌రూరల్: వికలాంగులు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ నాయకులు వై.సాయన్న అన్నారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేస్తున్న వికలాంగులకు ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు నివాస స్థలాలు కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, బ్యాక్‌లాగ్ పోస్టులు వికలాంగులకు కల్పించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి అందించే పథకాల్లో వికలాంగులకు షరతులు లేకుండా వర్తింపజేయాలన్నారు. అర్హులైన వికలాంగులకు పెన్షన్లు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్ముల అశోక్, ఆఖిల్, విజయ్ కుమార్, రాజన్న, ఠాగూర్, రవీందర్‌సింగ్, నర్సయ్య, విశాల్ గౌడ్‌లున్నారు.

బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రాజన్న

ఖానాపూర్: జీఎస్టీ నుండి బీడీ పరిశ్రమను మినహాయించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కే.రాజన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమాశేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లక్షలాది మంది కార్మికులు ఆధారపడి ఉన్న బీడీ పరిశ్రమను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమను కుదేలు చేసేలా చర్యలు తీసుకోవడం సరికాదని ఆయన మండిపడ్డారు. బీడీ కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా బీడీ పరిశ్రమపై ఆంక్షలు, షరతులు విధించడం సరికాదన్నారు. జీఎస్టీ ద్వారా బీడీలపై 28 శాతం, తునికాకుపై 18 శాతం, తంబాకుపై 5 శాతం పన్నులు విధించడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే బీడీ పరిశ్రమపై ఆంక్షలు ఎత్తివేయాలని, బీడీ కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని తదితర డిమాండ్లతో ఈ నెల 10వ తేదీన జిల్లా కేంద్రం నిర్మల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య, నాయకులు ఆంకూష్‌రావు, కుంచపు ఎల్లయ్య, మంచికంటి లక్ష్మణ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గంధం భూమేశ్వర్‌లున్నారు.


మాట్లాడుతున్న కే. రాజన్న

యువకుడి రక్తదానం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాహితికి అత్యవసరంగా ఎ-పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రాజరాజేశ్వర్ ట్రావెల్స్‌కు చెందిన హ రీష్ రక్తాన్ని అందించారు. సాహితికి ఆరు నెలల గర్భవతి కావడంతో రక్తస్రావం జరగ గా, రక్తం అవసరమని వైద్యులు సూచించా రు. హరీష్‌కు ఫోన్ చేయగా ఆయన వెం ట నే రక్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది లక్ష్మి, శ్రీనివాస్, సునీత, రమణలు పాల్గొన్నారు.

యువత దురలవాట్లకు దూరంగా ఉండండి : సీఐ

నిర్మల్‌కల్చరల్: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని నిర్మల్ పట్టణ సీఐ జాన్ దివాకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం దీక్ష జూనియర్ కళాశాలలో మారక ద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పొగ త్రాగడం, గుట్కా తినడం, గంజాయి వినియోగించడం వంటి వాటికి యువత దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఎన్నో ఆశలు పెట్టుకొని తల్లిదండ్రులు విద్యార్థులను చదివిస్తూ వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని చూస్తున్నారని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు నడుచుకొని, దురలవాట్లకు దూరంగా భానిస కావద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కిరణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ దివాకర్

ఇంటర్వ్యూ

వ్యాపారస్తులు ఇన్వాయిస్‌లు ఇవ్వాలి


సీటీవో గోవర్ధన్ పట్వారి

ఆంధ్రజ్యోతి: జీఎస్టీ తర్వాత వ్యాపారస్తులకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి..?

అధికారి: కొనుగోలు దారులకు వ్యాపారస్తులు తప్పని సరిగా ఇన్వాయిస్‌లు ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ పూర్తయిందా.?

అధికారి: జీఎస్టీ పరిధిలో 2200 రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా 200 మంది కొత్తగా రిజిస్టర్ చేయించుకున్నారు.

ఆంధ్రజ్యోతి: జీఎస్టీ ప్రకారం రిటర్నులు ఎప్పటిలోగా ఫైలింగ్ చేసుకోవాలి.?

అధికారి: జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్లలో జీఎస్టీఆర్-3బి, జీఎస్టీఆర్-1, జీఎస్టీఆర్-3బి,జీఎస్టీఆర్-2, దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: జీఎస్టీ మారిన ధరలను ఏ విధంగా తనిఖీ చేస్తున్నారు.?

అధికారి: తనిఖీలపై ఆదేశాలు ఇంత వరకు రాలేదు. వ్యాపారస్తులు జీఎస్టీకి అనుకూలంగా మారిన ధరలు ప్రకటించి జీఎస్టీ రిజిస్ట్రేషన్ నెంబర్లు దుకాణాల వద్ద ప్రదర్శించాలి.

-నిర్మల్ కల్చరల్

పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలి

నిర్మల్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఆరోగ్య పరిపోషణను నిర్వహించే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో మమత అన్నారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. 3-5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు. ఇక నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కలిగే ఆరోగ్య పరివృద్ధిపై గ్రేడింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో పిల్లలకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నెల 17న వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రుబెల్లా, తట్టు టీకాలపై ఆరోగ్య ప్రచారశాఖ అధికారి తులసి రమణా అవగాహన కల్పించారు. 9 నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఈ టీకాలను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది రాజకుమారి, రేవతి, శ్రీలక్ష్మి, భారతి, విజయ గౌరి, గౌరిరాణిలు పాల్గొన్నారు.

‘ఈ నెల 7 వరకు తల్లి పాల వారోత్సవాలు’

నిర్మల్‌కల్చరల్: తల్లిపాల వారోత్సవాలను ఈ నెల 7 వరకు జరుపుతున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎ.విజయలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బిడ్డ పుట్టిన గంటలో ముర్రుపాలు తాగించాలని దీనితో సంవత్సరంలోను శిశు మరణాలు తగ్గుతాయని తెలిపారు. పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే తాగించినట్లయితే వారు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రాఖీ పౌర్ణమిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పురుషులందరికి రాఖీలు కట్టేట్లు నిర్ణయించినట్లు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంపు

కడెం: ప్రభుత్వం అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ గడువు ఈ నెల 15 వరకు పెంచడం జరిగిందని ఎంపీడీవో విలాస్ కుమార్ గౌడ్ తెలిపారు. బ్యాంక్ అనుమతి పత్రం తీసుకొని అన్ని సర్టిఫికెట్లతో మీ సేవ కేంద్రంలో గాని, నేరుగా గాని మండల్ పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయస్సు 21 నుండి 55 వరకు సంవత్సరాలు కలిగిన వారు దరఖాస్తు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేజీబీవీ స్కూల్‌ను తనిఖీ చేసిన అబ్జర్వర్

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని రాష్ట్ర పరిశీలకులు టి. శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. విద్యాలయంలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌళిక వసతులు గదులు, టాయిలెట్స్, వంటగది తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సెక్టోరియర్ అధికారి వెంకట రమణారెడ్డి ద్వారా నిర్వాహణ తీరును అడిగి తెలుసుకున్నారు. 6, 7 తరగతుల్లో 80 మంది విద్యార్థులకు 68 మంది విద్యార్థులు భర్తీ అయ్యారని తెలిపారు. 7వ తరగతిలో 12 సీట్లు ఖాళీ ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సలోమీ కరుణ, మండల విద్యాధికారి కె. శంకర్, ఎస్‌వో ప్రవీణ, సీఆర్టీలున్నారు.

న్యూడెమోక్రసీలో పలువురి చేరిక

ఖానాపూర్: సీపీఐయంఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గంలో పని చేసిన పలువురు నాయకులు బుధవారం సీపీఐయంఎల్ న్యూడెమోక్రసీ రాయల వర్గంలో చేరారు. ఈ సందర్భంగా మంచి కంటి లక్ష్మణ్, అడిదెల రాజేశ్వర్, రాంకంటి రాజన్న అనే ముగ్గురు నాయకులు గతంలో ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ సంఘాల్లో పని చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె. రాజన్నల ఆధ్వర్యంలో వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు అంకుష్ రావు, కుంచెపు ఎల్లయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గంధం భూమేశ్వర్ లున్నారు.

బాలింతలకు కేసీఆర్ కిట్ పంపిణీ

కడెం: మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామానికి చెందిన తలారి వనిత కడెం ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కాగా ఆసుపత్రి డాక్టర్ మానస, సిబ్బంది బాలింత వనితకు కేసీఆర్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సు చంద్రకళ, స్టాఫ్ నర్స్‌లు శ్రీదేవి, శాంత కుమారి, సంధ్య, మ్యారి ఫ్లోరెన్స్, సూపర్ వైజర్ గోపాల్, కృష్ణవేణి, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు విజయదర్శిని, సిబ్బంది గంగారాం, ప్రమీళలు పాల్గొన్నారు.

సోన్ మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఎన్నిక

సోన్: మండల విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఉల్లెంపుల రవీందర్, ఉపాధ్యక్షుడిగా తుంగణపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి చిన్న నర్సయ్య, కోశాధికారిగా శ్రీనివాస్, సహాయకార్యదర్శిగా సుంకరి పెద్ద నర్సయ్యలను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

'జిల్లాలో 31 మంది ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ'

నిర్మల్‌కల్చరల్: నిర్మల్ జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న 31 మంది ఉపాధ్యాయుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించినట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి. రామారావు, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేంధర్‌లు తెలిపారు. రెగ్యూలరైజేషన్ ఉత్తర్వులను సకాలంలో విడుదల చేసినందుకు వారు డీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

యంఆర్ టీకాల గురించి అవగాహన

పెంబి: 9 నెలల నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలందరికి సమీప టీకా కేంద్రంలో టీకాలు ఇప్పించాలని హెచ్‌ఈవో వేణుగోపాల్ అన్నారు. బుధవారం పెంబి మండలంలోని ఇటిక్యాల్ గ్రామ పంచాయితీ పరిధిలోని కోసగుట్టలోని ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఈ నెల 10న నులిపురుగుల మందులు మరియు ఈ నెల 17న తట్టు, రుబెల్లా వ్యాధుల టీకా గురించి పెంబి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మధు, ఏఎన్ఎం సరోజ, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, పరుశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈనెల 5, 6న ఫిజికల్ టీచర్స్ వర్క్‌షాప్

నిర్మల్‌స్పోర్ట్స్: ఈ నెల 5, 6 తేదీల్లో ఫిజికల్ సైన్స్ టీచర్లకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కూన రమేష్, జిల్లా కార్యదర్శి ఎ. రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని యంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌కు అనుమతినివ్వాల్సిందిగా వారు డీఈవోకు విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న వర్క్ షాపుకు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

రిటైర్డు ఉపాధ్యాయుడికి సన్మానం

నిర్మల్ కల్చరల్: ఇటీవల పదవీ విరమణ పొందిన గాజుల నర్సాపూర్ ఉర్దూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి. అనీల్ రావును ప్రియదర్శిని నగర్, నిర్మల్ వాసులు బుధవారం సన్మానించారు. కౌన్సిలర్ సీహెచ్ రవితో పాటు ఉపాధ్యాయులు రాజేంద్రకుమార్ జేవి. రమణ, మారుతి, చంద్రప్రకాష్ గౌడ్, బొద్దుల రమణ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది

● **బీజేపీ జిల్లా ఇన్‌చార్జీ మోహన్‌రెడ్డి**


సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు

ఖానాపూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో భారత దేశం ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జీ కొంపల్లి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవిలు అన్నారు. మండల కేంద్రంలోని ఏయంకే ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు పడాల రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ జిల్లా కమిటీ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో తమ ప్రభుత్వం ఎన్నో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి అభివృద్ధిని వేగవంతం చేసిందన్నారు. నల్లధనం వెలికి తీసేందుకు, అవినీతి ఆరికట్టేందుకు తీసుకున్న పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ చట్టం ఆమోదింపజేయడం లాంటి సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకోవడం లాంటి ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఒక పక్క దేశాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంటే రాష్ట్రంలో అవగాహన లేకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని వారు ఆరోపించారు. ఇప్పటి వరకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్ని నీటి మూటలయ్యాయని ఎద్దేవా చేశారు. హరితహారం పథకం కేవలం ఫోటోలకు ఫోజిలిచ్చేదిగా మారి పోయిందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 2 కోట్ల మొక్కలను నాటమని చెబుతున్న ప్రభుత్వం వాటిలో ఎన్ని మొక్కలను రక్షించిందో స్పష్టం చేయాలన్నారు. కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసి ఏడాది దాటిన జిల్లా కేంద్రంలో నూతన భవనాలు నిర్మించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం పట్టణానికి దూరంగా ఉన్న భీమన్న గుట్టను ఎంపిక చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసేలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన టీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం యంఐయం ఒత్తిళ్ళకు తలొగ్గి ఆ మాటను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జిల్లా రైతుల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోదావరి కృష్ణ జలాల, కమి టీ రాష్ట్ర కన్వీనర్ రావుల రాంనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓడిసెల శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు, జిల్లా నాయకులు తో కల బుచ్చన్న యాదవ్, ఆనంద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిత తెలంగాణలో అందరూ భాగస్వాములు కావాలి


మొక్కలు నాటుతున్న అధికారులు

కడెం: ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో అందరూ భాగస్వాములై మొక్కలు నాటాలని డీఈవో ప్రణీత, ఖానాపూర్ సీఐ పెద్దన్న కుమార్ అన్నారు. మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని సారంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో హరితహారంలో భాగంగా డీఈవో ప్రణీత, సీఐ పెద్దన్న కుమార్ గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులతోనే మానవ మనుగడ సాగుతుందన్నారు. అడవులు నరికివేతకు గురి కావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో మొక్కలు నాటి భావి తరాలకు అటవీ సంపదను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, హెచ్ఎం సంధ్యారాణి, కృష్ణవేణి, గ్రామస్తులు కోల శ్రీనివాస్, జెట్టి నర్సయ్య, లక్ష్మి నర్సయ్య, నారాయణ, లక్ష్మణ్, రాజు, మామిడి , గంగారెడ్డి, గంగాధర్‌లున్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతి పత్రానిస్తున్న నాయకులు

ఖానాపూర్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ వొకేషనల్ కళాశాలలో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూల్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా సహయ కార్యదర్శి సునారికారి రాజేష్ ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్‌కు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే ఫీజు రియాంబర్స్‌మెంట్‌తోనే కోర్సు చదివేందుకు తొలుత విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఆదనంగా ఆరువేల రూపాయాలను చెల్లిస్తేనే ధృవీకరణ పత్రాలు అందజేస్తామని యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సదరు వొకేషనల్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి జేవింద్, నాయకులు రాజు, ఆకాష్, మహేష్ తదితరులున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు పని చేయడం లేదంటూ ప్రజల నిరసన


నిరసన తెలుపుతున్న రైతులు

పెంబి: మండలంలో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు పనిచేయక పోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంక్, తహసీల్దార్ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుండి వస్తే బీఎస్ఎన్‌ఎల్ సిగ్నల్ లేక ఆన్‌లైన్ పనిచేయక పోవడం వల్ల పనులు కాకా పోవడంతో నిరాశతో తమ గ్రామాలకు తిరుగు ప్రయాణమవుతున్నట్లు వాపోతున్నారు. బుధవారం సైతం బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ లేక ఆన్‌లైన్ సేవలు పని చేయక పోవడంతో బ్యాంక్ ముందు నిలబడి ప్రజలు నిరసన తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ బాగయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లిం గన్న మెర నర్సయ్య, గ్రామస్తులున్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


మాట్లాడుతున్న రమేష్

పెంబి: సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షను విధానంను పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బుధవారం మండలంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో సీపీఎస్‌టీఈఏ-టీఎస్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ మాట్లాడుతూ ఈ రోజు, రేపు సీపీఎస్ ఉద్యోగులు సీపీఎస్ పెన్షన్ విధానంకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరు అవుతున్నామన్నారు. సీపీఎస్‌టీఈఏ-టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహా ధర్నాకు మద్ధతుగా జిల్లాలోని సీ పీ ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవులు పెట్టి అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎస్‌టీఈఏ-టీఎస్ జిల్లా కార్యదర్శులు జె. రాజేందర్, పి. సురేష్, సహాధ్యక్షుడు శ్రీకాంత్, అనిల్, సునీల్, ఎస్‌కె నబీలు పాల్గొన్నారు

'విద్యార్థులకు వసతులు కల్పించాలి'

నిర్మల్‌టౌన్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ సిహెచ్ శివలింగయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. నిర్మల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమయ్యే సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శివాజీ గౌడ్, మహేష్, రాజేందర్, శశిరాజ్, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

'హరితహారంలో భాగస్వాములు కావాలి'

కుభీర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో ప్రతీఒక్కరు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుభీర్ ఎస్సై రమేష్ తెలిపారు. గత వారం మండలంలోని పల్సి పశు వైద్య శాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హరిహారంలో నాటిన మొక్కలను బతికించి పర్యవరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన అన్నారు. అంతేకాకుండా మానవమనుడకు మొక్కల అవశ్యకత ఎంతగానో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సర్వోత్తం, రాజన్న, ఎంపిటీసీ రాములు, నాయకులు చంటన్న, డా.రాజన్న, పోతన్న, గజ్జారాం, దర్మపురి, సర్పంచ్, తదితరులు ఉన్నారు.

'పకడ్బందీగా రికార్డుల నిర్వహణ చేపట్టాలి'

భైంసా: రెవెన్యూ శాఖకు చెందిన రికార్డుల నిర్వాహణ ప్రక్రియను పారదర్శకతమైన తీరుతో లోపాలకు తావు లేకుండా నిర్వహించాలని ఆర్డీవో రాజు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మ్యూటేషన్లు, దరఖాస్తుల పరిశీలన,వివరాల నమోదు, ధృవీకరణ పత్రాల జారీ విధానాల్లో జాగరుకతతో వ్యవహరించాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తప్పులకు అవకాశం లేకుండా వ్యవహరించాలన్నారు. తమ తమ పరిధిలోని ప్రాంతాల్లోని ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. రికార్డుల నమోదుకు సంబంధించి కాలయాపనకు అస్కారం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. ఇందులో తహసీల్దార్ సుభాష్ చంద్ర, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, మండల, పట్టణ పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపులో హిందీని చేర్చడం హర్షనీయం : తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

లోకేశ్వరం: సామర్థ్యాల పెంపు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం హిందీని చేర్చడం హర్షనీయమని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకరి రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విద్యాశాఖ రూపొందించిన సామర్థ్యాల పెంపు కార్యక్రమంలో భాగంగా చదవడం, వ్రాయడం విధానంలో తెలుగు, ఆంగ్లం, గణితంతో పాటు హిందీ విషయానికి చోటు కల్పించడం హర్షనీయమని పేర్కొన్నారు. అలాగే ఆయా ఉపాధ్యాయులు హిందీనే బోధించుటకు మార్గదర్శక జీవోను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై హిందీ విషయ ఉపాధ్యాయులు సందిగ్ధ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తపస్ జిల్లా బాధ్యులు జిల్లా విద్యాధికారిణికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తమ విజ్ఞప్తిని ఉన్నతస్థాయి అధికారులు సానుకూలంగా స్పందించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. తపస్‌కు ఉపాధ్యాయ సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

నాసిరకం పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.కోటి 50 లక్షలతో చేపడుతున్న సీసీ గ్రౌండ్, కాంపౌండ్‌వాల్ ఓపెన్ షెడ్ పనులు నాసిరకంగా నాణ్యతలోపంగా చేపడుతున్నారని పనులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు కుభీర్ ఎంపీటీసీ సభ్యురాలు మ్యాకల శాంతబాయి నర్సప్ప బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. పనులు సబ్ కాంట్రక్టర్ చేపడుతూ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇంజనీర్ పర్యావేక్షణ లేకపోవడం, నాణ్యత లేని లోకల్ ఇసుక, సిమెంట్, పాత స్టీల్‌తో పనులు చేపడుతున్నారని అన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ట్రస్టు ఆధ్వర్యంలో శుద్ధజల నీటి సేవలు

భైంసా: పట్టణ పరిధిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనసూయ పవార్ చారిటబుల్ ట్రస్టు కొత్తగా ఉచిత శుద్ధ జల నీటి సేవలను ప్రారంభించింది. పట్టణంలోని పాత సినిమా టాకీస్ ప్రాంతంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రాదమ్మ బోజనాలయం వద్ద శుద్ధ జల ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ట్రస్టు ప్రతినిధులు శంకర్ (గుంటూర్), మధు పటేల్,అశోక్ పటేల్‌లు పూజ కార్యక్రమాలు నిర్వహించి శుద్ధ జల నీటి సేవలను ప్రారంభించారు. అన్ని వేళల ప్లాంట్ నుంచి శుద్ధ జలాన్ని ఉచితంగా అందించేందుగాను ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా ట్రస్టు ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణవాసులు ట్రస్టు ద్వారా అందిస్తున్న ఉచిత శుద్ధ జల సేవలను సద్వినియోగపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీపీ

భైంసా రూరల్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంపీపీ నంగి వనిత, ఎంపీడీవో సాయిరాంలు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వివరాల పట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వచ్చిన దుస్తులు అస్తవ్యస్తంగా పడి ఉన్నాయని, వాటిని ఎందుకు పంపిణీ చేయలేదని ప్రిన్సిపాల్‌ను అడిగారు. రికార్డులను సరిగా రాయడం లేదని, గత నెలలోని ఏడు రోజుల వివరాలను ఎందుకు రాయలేదని ఎంపీపీ ప్రశ్నించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం సరిగా ఉండటం లేదన్నారు. ఈ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, నిర్వహణ తీరులో మార్పులు రావాలని సూచించారు.

నీటి నిల్వ కుంటలను పూర్తిచేయండి

లోకేశ్వరం: ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న నీటి నిల్వ కుండలను త్వరితగతిన పూర్తిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఎపిఓ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఉపాధిహామీ వారాంతపు సమావేశంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి నిల్వ కుంటలతో పాటు ఎరువు గుంతలను టార్గెట్ వారిగా పూర్తిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల ఆధార్ అకౌంట్ నెంబర్లను సేకరించాలన్నారు. ఏపీవో శివలింగయ్య, ఈసీ అనిల్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

భూ సర్వేతో వివాదాలకు చెక్

- కుటుంబ సర్వే మాదిరి వివరాల సేకరణ
- ప్రారంభమైన సమగ్ర సర్వే
- ముమ్మరం చేశాం : తహసీల్దార్

కుభీర్: సమగ్ర కుటుంబ సర్వే తరహాలో భూముల లెక్కను కచ్చితంగా తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భూ సర్వేకు రంగం సిద్ధం చేసింది. దీంతో భూ దళారుల గుండెల్లో రైళ్ల పరుగులు పెడుతున్నాయి. అమాయకపు రైతులను మోసం చేసి దొడ్డి దారిన పట్టాలు చేయించుకున్నవారి జాబితా వివాదస్పద భూముల వివరాల లెక్కను సరిచేయడం కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా సర్వే ప్రారంభమైంది.

● ఎప్పుడూ ఒకచోట తగాదాలు..

మండలంలో ఎక్కడో చోట భూముల కోసం అన్నదమ్ముల, భూ దలారుల మధ్య తగాదాలు ఆత్మహత్యలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయి. వీటన్నింటిని పరిష్కరించేందుకు కోర్టుల చుట్టూ తిరగడం తప్పడం లేదు. ఇలాంటి భూతగాదాలను పరిష్కరించేందుకే కాకుండా పల్లెల నుంచి పట్టణాల వరకు ఎక్కడెక్కడ ఎంత? ఎవరి పేరిట ఉంది? విస్తీర్ణం ఎంత సాగు? భూములెన్ని? వాటి హక్కుదారులెవరు? ఇలా పక్కాగా ప్రతీ అంగుళం వివరాలను సమగ్రంగా సేకరించేందుకు సమగ్ర భూములను సర్వేచేసి పక్కాగా రికార్డు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.

● పక్కాగా వాస్తవాలు బయటకు..

భూముల వివాదాలు పరిష్కరించి వాస్తవ యజమానులెవరో పక్కాగా గుర్తించి పట్టాదారుల పేర్లను ప్రకటించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సర్వే ముమ్మరం చేస్తున్నారు.


వివాదంలో ఉన్న భూమి


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

● యూనిక్ కోడ్‌తో టైటిల్ డీడ్

ఏ భూమి ఎవరిదన్న లెక్కలు తేలిన తర్వాత కొత్త టైటిల్ డీడ్ కమ్ పాస్ పుస్తకాలు ఇస్తారు. ప్రతి రైతుకు పాస్ పుస్తకానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇస్తారు. భూ రికార్డులన్నీ సరిచేసిన తర్వాత రూపొందించిన జాబితానే ప్రభుత్వం అనసరిస్తుంది. ఆ వివరాల ఆధారంగా ఏ రైతు పేరిట ఎంత భూమి ఉందనే దాని ప్రకారం పెట్టుబడి సాయం పతకాన్ని అమలు చేస్తుంది. భవిష్యత్తులో ఎక్కడ ఎవరూ భూమి కొన్నా, అమ్మినా, పేరు మార్పిడి జరిగినా వారసులకు దక్కినా, ఆ వివరాలన్నీ వెంటనే ఆన్‌లైన్‌లో రికార్డుల్లో ఆప్‌డేట్ అవుతుంటాయి.

● భూ వివాదాలు ఉండవు

- శ్రీకాంత్, తహసీల్దార్, కుభీర్

భూ సర్వే నిర్వహించడం మంచిదే పైఅధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు సర్వే ముమ్మరం చేశాం. ఉన్నతాధికారులు చెప్పిన మాదిరిగానే భూ వివరాలు సేకరిస్తున్నాం. అంతేకాకుండా ప్రస్తుతం భూములకు సంబంధించిన వివాదాలను పరిష్కరిస్తూ నిర్థీత సమయంలో భూ సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తాం.

మొక్కలను బాధ్యతగా సంరక్షించాలి : ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పశువుల సంత అవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతికూల వాతవరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు ఆశాజనకమైన స్థితిలో పెరిగి చెట్లుగా ఎదిగినపుడే సీఎం కేసీఆర్ ఆశయం సిద్ధిస్తుందన్నారు. రెండో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికార, పాలక వర్గాలు ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా ఆశాజనకంగా పెంచడం అభినందించతగ్గ విషయమన్నారు. ఇందులో మార్కెటింగ్ అధికార, పాలకవర్గ ప్రతినిధులు, టీఆర్ఎస్ ప్రతినిధులు, అటవీశాఖాధికారులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని 14వ వార్డు పరిధిలో కౌన్సిలర్ రాణి చందులాల్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌లు మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు.


మొక్కకు నీటిని పోస్తున్న ఎమ్మెల్యే

● 'గొడిసెరను జీపీగా ఏర్పాటు చేయరూ!'

లోకేశ్వరం: మండలంలోని గొడిసెర గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా గుర్తించాలని గొడిసెర గ్రామస్థులు బుధవారం ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. గొడిసెర గ్రామంలో 1550 జనాభా ఉండని 820 మంది ఓటర్లు ఉన్నందున ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి గ్రామస్థులు విన్నవించారు. పునర్విభజనలో భాగంగా తమ గ్రామాన్ని గ్రామపంచాయతీగా గుర్తించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో జోహర్‌పూర్ సర్పంచ్ దడ్డె రాజేశ్వర్, ఎంపిటిసి దత్తు పటేల్, గ్రామస్థులు రమణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూ

హరితహారం పథకం విజయవంతానికి విశేష కృషి


సుగుణ, ఏపీవో, కుంటాల

ఆంధ్రజ్యోతి: హరితహారం పథకం విజయవంతానివర్యలు చేపడుతున్నారా?

ఏపీవో: హరితహారం విజయవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఒక్కో గ్రామ పంచాయతీకి 40 వేల చొప్పున మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటికే 2 లక్షల 8వేల మొక్కలు నాటాం. వర్షాభావం దృష్ట్యా మరిన్ని మొక్కలు నాటడం ఆలస్యమవుతోంది.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకం ద్వారా ఏమి పనులు చేపడుతున్నారు?

ఏపీవో: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో కంపోస్ట్, పాఠశాలల్లో వంటగదులు, రైతులకు పశువుల పాకలు, గ్రామాల్లో శ్మశాన వాటికల నిర్మాణం పనులు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకంలో కూలీల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఏపీవో: జాబ్‌కార్డు లేని కూలీలకు నూతనంగా జాబ్‌కార్డులు అందజేస్తున్నాం. కూలీల ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలను నూతనంగా సేకరించడం జరుగుతోంది.

- కుంటాల

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భైంసా రూరల్: మండలంలోని దేగాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. గత నాలుగు రోజులుగా అరగంటలో దాదపు పదిసార్లు సరఫరా నిలిచిపోతుంది. కన్ను మూసి తెరిచేలోపు విద్యుత్ నిలకడగా ఉండడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి నెలకొంది. మరోపక్క రాత్రుల్లో చీకటి రాజ్యమేలుతుంది. ప్రస్తుత వాతవరణం ఎండాకాలాన్ని తలపిస్తుండగా రాత్రుల్లో ఇంట్లో ఫ్యాన్‌లు లేనిదే నిద్దుర పట్టని దుస్థితి నెలకొంది. మరోపక్క దోమల బెడద తీవ్రతరం అయ్యింది. వీటికి తోడు కరెంటు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంటికి కునుకులేక దోమల కాటుతో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

'మూడెకరాల భూమి ఇవ్వాలి'

కుభీర్: అర్హులైన దళిత కుటుంబాలకు ప్రభుత్వం దళిత బస్తీ కింద మూడెకరాల భూమిని అందించాలని బుధవారం మాదిగ జేఏసీ నాయకులు తహసీల్దార్ శ్రీకాంత్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వ్యవసాయ అధారిత కుటుంబాలకు ప్రభుత్వం మూడెకరాల భూమిని అందిస్తామని గొప్పలు చెబుతున్నారే తప్ప అమలు చేయడం లేదని అన్నారు. అదేవిధంగా ఉండడానికి కనీసం గూడులేని వారికి సైతం డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయడం లేదని అన్నారు. అంతేకాకుండా, ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పకుండా మూడెకరాల భూమి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు శంకర్, గౌతమ్, కాశీనాథ్, ప్రసాద్, రాహుల్, రాందాస్ నారాయణ కిషన్, తదితరులు ఉన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ప్రియతములతో చర్చలు, ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. సన్నిహితుల నుంచి మెయిల్స్, సందేశాలు అందుకుంటారు. పొదుపు పథకాలు, పెట్టుబడులకు ప్రణాళికలు రూపొందిస్తారు. విద్యార్థులకు శుభప్రదం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. గతించిన వ్యక్తులను స్మరించుకుంటారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి అనుకూలం.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. వేడుకల్లో పాల్గొంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు ఫలిస్తాయి. కొత్త స్నేహాలు, పరిచయాలు ఆనందం కలిగిస్తాయి.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): పరిశ్రమలు, వ్యవసాయరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆస్పత్రులు, హోటల్, ఔషధ రంగా వారు లాభాలు ఆర్జిస్తారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం లభిస్తుంది.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. చిన్నారుల విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. సాంకేతిక కోర్సుల్లో చేరే వారికి అనుకూల సమయం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): నిత్యావసరాలు, నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాల వారికి ప్రోత్సాహకరం. కుటుంబ వ్యవహారాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. సంస్కరణల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో ఇల్లు సందడిగా ఉంటుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతములతో చర్చలు, ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. పెట్టుబడులకు సంబంధించి కీలక సమాచారం సేకరిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, ఉద్యోగాల్లో ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. అదనపు సౌకర్యాలు అందుకుంటారు. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లకు అవకాశం ఉంది. శ్రమకు తగిన ప్రతిఫలం అందుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): లక్ష్య సాధన కోసం కొత్త పథకాలు రూపొందిస్తారు. సమావేశాలు, బృందకార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఉన్నత విద్యా విషయాల్లో ఒక నిర్ణయానికి వస్తారు. వేడుకల్లో పాల్గొంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): స్నేహానుబంధాలు బలపడతాయి. బంధుమిత్రులతో వేడుకల్లో ఉల్లాసంగా గడుపుతారు. పెట్టుబడులు లాభిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు.

మీనరాశి: (ఫిబ్రవరి19-మార్చి20): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వైద్యం, హోటల్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాల వారికి ప్రోత్సాహకరం. ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న



దండేపల్లిలో మాట్లాడుతున్న జాడి రాజన్న

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు కొత్తగా అమలు చేస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దండేపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో ఉద్యోగుల ఖాతాలో జమ అయిన మొత్తం నుంచి పిల్లల చదువులకు, గృహ అవసరాలకు కాని రుణం తీసుకునే సదుపాయం లేదన్నారు. ఒకవేళ సదరు ఉద్యోగి సర్వీస్ మధ్యలో మృతిచెందితే ఆ కుటుంబానికి ఆర్థిక పరమైన ఎటువంటి ప్రయోజనాలు అందే అవకాశం లేదన్నారు. అదేవిధంగా సభ్యులకు పింఛన్లు లేదన్నారు. సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. దీనికి నిరసనగా ఆగస్టు 8,9 తేదీలో జిల్లాలోని అన్ని మండలాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 1న విద్రోహదినంగా పాటించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలన్నారు. అలాగే జిల్లా కేంద్రాలో కలెక్టరేట్ ఎదుట సామూహిక ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సర్వీస్ రూల్స్ రూపొందించి ఉపాధ్యాయులకు బదిలీ, పదోన్నతులు షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దసరా సెలవులో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాన్నారు. డైట్ లెక్చరర్స్ పదోన్నతులకు మార్గం సుగమం అయినందున ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు యంఎడ్, పీజీ చేయుటకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రామటెంకి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రాజలింగు పాల్గొన్నారు.

'గిరిజనులపై అటవీ అధికారుల కక్ష సాధింపు చర్యలు'



అటవీ అధికారులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న గిరిజనులు

నెన్నెల: గిరిజనులపై అటవీ అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న ఆరోపించారు. నెన్నెల శివారులో సర్వే నంబరు 671, 672లలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లో పంటలను అటవీ శాఖ వారు ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. పంటలను రైతులతో కలిసి సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాగాల రాజన్న విలేకరులతో మాట్లాడారు. వందల ఎకరాల భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న రాజకీయ నాయకులు, బడా రైతులు సాగు చేసుకునే వారిని ఏమీ అనకుండా పేద గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన ఒంటరి మహిళ బాగాల సునీత చేనులో పత్తి పంటను జీపుతో తొక్కించారన్నారు. అటవీ అధికారుల వేధింపులు ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, నాయకులు రెడ్డి బక్కన్న, మేసినేని చంద్రయ్య, జంబి బాపు, గొలిసిట్టె రాజయ్య, మీనుగు వెంకయ్య, మల్లయ్య, జె. మల్లక్క, ఎ.భీమక్క, పోసక్క తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. 14,16,18,20 సంవత్సరాల లోపు బాలబాలికలు ఈ పోటీలకు అర్హులన్నారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 11 నుండి 13 వరకు గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలిచిన వారు లక్సెట్టిపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డికి జనన ధ్రువీకరణ పత్రాలతో రిపోర్ట్ చేయాలన్నారు.

రేపు ఆర్ఎంపీ, పీఎంపీల మహాసభ

మంచిర్యాల టౌన్: మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఆర్ఎంపీ, పీఎంపీల ప్రథమ మహాసభను శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలం'

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కారించడంలో పూర్తిగా విఫలం చెందిందని నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రామ్ ప్రసాద్ అన్నారు. బుధవారం దండేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ల దాటిన ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడం లేదన్నారు. సర్కార్ విద్యాను సీఎం కేసీఆర్ ఏమాత్రం పట్టించుకోక ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సాహించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు, వసతి గృహాలు శిథిలావస్థకు చేరిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చదువుకుంటూరన్నారు. దండేపల్లిలో బీసీ వసతి గృహం ఏర్పాటు చేసినప్పటి నుంచి పక్కా భవనం లేక అద్దె భవనంలో ఉంటున్నారు. అందుకూడ సరైన మౌళిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి చంద్రశేకర్, జిల్లా ఉపాధ్యక్షులు అజ్మత్‌ఖాన్, మండల నాయకులు ప్రవీణ్, లక్ష్మణ్, సుమంత్ ఉన్నారు.

'అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

మంచిర్యాల క్రైం: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను అందించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. డీఆర్ఓకు బుధవారం ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం అందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో వలసకు వచ్చి అనేక సంవత్సరాలుగా ఉపాధి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. అలాగే సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వని పక్షంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాల్‌కుమార్, దేవరాజు, ప్రవీణ్, సుధాకర్, భాగ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

'లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలి'

మంచిర్యాల క్రైం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర అంజి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు దుర్గరాజ్, లింగంరవి, క్రాంతికుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రెండు సర్కిల్‌లుగా వాటర్ గ్రిడ్ విభజన

◆ పనుల పర్యవేక్షణ, వేగవంతం కోసం మార్పులు ◆ ఇక ఆదిలాబాద్, మంచిర్యాల్ సర్కిల్‌లు మాత్రమే ◆ నాలుగు జిల్లాల్లో ఈఈ కార్యాలయాలు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం

మిషన్ భగీరథ పథకం పనులను గడువులోగా పూర్తి చేసి ఇచ్చిన హామీని నిలుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాటర్ గ్రిడ్‌లను విభజించి వికేంద్రీకరణ చర్యలకు శ్రీకారం చుడుతోంది. ఈ పథకం కింద నిర్దేశిత గడువులోగా పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికీ నల్లా నీరు ఇవ్వాలని సర్కారు సంకల్పించిన సంగతి తెలిసిందే. వాటర్ గ్రిడ్ ఏర్పడగానే నిర్మల్‌లో ఎస్‌ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. అప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్యాలయం ఆదిలాబాద్‌లో ఉండగా వాటర్ గ్రిడ్ ఎస్‌ఈ కార్యాలయాన్ని ప్రత్యేకంగా నిర్మల్‌లో ప్రారంభించారు. నిర్మల్‌లో ఏర్పడ్డ ఎస్‌ఈ కార్యాలయం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల్, కొమురంభీం, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సంబంధించి మిషన్ భగీరథ పనుల పర్యవేక్షణ జరుగుతోంది. మొత్తం వాటర్ గ్రిడ్ కార్యకలాపాలన్నీ నిర్మల్ కేంద్రంగా కొనసాగుతున్నవి. అయితే దీని కారణంగా పర్యవేక్షణ భారంగా మారిందంటున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో భగీరథ పనులపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం, అలాగే పనుల్లో జాప్యం జరుగుతుందన్నందున గడువులోగా పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించచడం లేదు. దీంతో ప్రభుత్వం వాటర్ గ్రిడ్ ప్రక్షాళనపై మేథోమథనం జరిపి సాధ్యసాధ్యాలపై దృష్టి కేంద్రీకరించింది. ఇందులో భాగంగానే ఇప్పటి వరకున్న నిర్మల్ సర్కిల్‌ను ఆదిలాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ పరిధిలోకి మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. నిర్మల్‌లో ఇక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. అలాగే కొమురంభీం, మంచిర్యాల జిల్లాలను కలిపి మంచిర్యాల కేంద్రంగా మరో కొత్త సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ రెగ్యూలర్ ఎస్‌ఈ ఇక నుంచి ఆదిలాబాద్, నిర్మల్ గ్రిడ్ పనులను పర్యవేక్షించనుండగా, మంచిర్యాల్ ఎస్‌ఈ ఆసిఫాబాద్, మంచిర్యాల గ్రిడ్‌ల పనులను పర్యవేక్షించనున్నారు. నాలుగు జిల్లాలకు గాను ప్రతీ జిల్లాకు ఒక ఈఈని, డివిజన్‌కు డీఈని నియమించారు. ఈ వికేంద్రీకరణ ద్వారా ఇక వాటర్ గ్రిడ్ పనులు వేగవంతంగా జరగనున్నాయని సంబంధిత అధికార యంత్రాంగం ఆశిస్తోంది.

● ఆదిలాబాద్, మంచిర్యాల పరిధిలోకి గ్రిడ్‌లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు గ్రిడ్‌లను కూడా ఆయా సర్కిల్ పరిధిలోకి చేర్చారు. నిర్మల్, ఆదిలాబాద్ గ్రిడ్‌లను ఆదిలాబాద్ ఎస్‌ఈ పరిధిలోకి, కొమురంభీం, మంచిర్యాల గ్రిడ్‌లను మంచిర్యాల ఎస్‌ఈ పరిధిలోకి మార్పు చేశారు. ఇలా ఇద్దరు పర్యవేక్షణ ఇంజినీర్‌లు వారివారి పరిధిలోని వాటర్ గ్రిడ్ పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీని కారణంగా పనుల్లో జాప్యం పూర్తిగా నివారింపబడుతుంది. ఆదిలాబాద్ ఎస్‌ఈ పరిధిలోకి భైంసా నుంచి జన్నారం వరకు గల గ్రిడ్ పనులు చేరనుండగా, జన్నారం నుంచి మంచిర్యాల గ్రిడ్‌లోకి చేర్చనున్నారు.

● గడువులోగా పూర్తి కోసమే ప్రక్షాళన

గడువులోగా మిషన్ భగీరథ పనులను పూర్తి చేసేందుకే గ్రిడ్‌ల విభజన ప్రక్రియను చేపట్టినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంగతి తెలిసిందే. కాగా చాలా చోట్ల మిషన్ భగీరథ పనులు నత్తనడకన సాగుతుండడంతో నిర్దేశిత కాల పరిమితిలోగా ఆపి పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. ఒకే ఎస్‌ఈ స్థాయి అధికారి నాలుగు జిల్లాల పనులను పర్యవేక్షిస్తుండడం పని భారం పెరుగుతుంది. ఫైళ్ల కదలిక కూడా నత్తనడకన సాగుతోంది. ఈ కారణంగా మిషన్ భగీరథ ప్రక్షాళన చేయాలన్న యోచనలో సర్కిల్ కార్యాలయాలను అదనంగా ఏర్పాటు చేసి మిగతా చోట్ల ఆర్‌డబ్ల్యూఎస్‌లోకి వాటిని విలీనం చేసి అక్కడి ఎస్‌ఈకి దీని అధికార పరిధిని కూడా విస్తరించారు.

● తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం క్రమక్రమంగా ఫలితం దిశగా పయనిస్తోంది. మూడు దశలుగా వర్గీకరించి చేపట్టిన ఈ పథకం పనులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వరప్రదాయినిగా మారనున్నాయి. ప్రస్తుతం మొదటి దశలో చేపట్టిన ఇంటెక్ వెల్, పంపింగ్, వాటర్‌ట్రిట్ మెంట్ పనులు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి మోటార్లు బిగింపు పనులు మిగిలి ఉన్నాయి. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు వాటర్ గ్రిడ్‌లు చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు రూ.1778 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు రాబోయే డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి, రెండో దశ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థ చేపట్టగా మూడో దశ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చేపట్టింది. నాలుగు గ్రిడ్‌లో భాగంగా నిర్మల్, భోథ్, ఆదిలాబాద్ సెగ్మెంట్‌లకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి అక్కడి అడ ప్రాజెక్టు నుంచి, మంచిర్యాల సెగ్మెంట్‌కు ఎల్లంపెల్లి ప్రాజెక్టు నుంచి, ఖానాపూర్ సెగ్మెంట్‌కు కడెం ప్రాజెక్టు నుంచి నీటిని వినియోగించనున్నారు. అలాగే ముథోల్ సెగ్మెంట్‌కు గడ్డెన్న వాగు ప్రాజెక్టు నుంచి నీరును తరలించనున్నారు. ఆయా ప్రాజెక్టు పరిధిలోనే ప్రస్తుతం ఇంటెక్ వెల్ పనులు పూర్తి చేశారు. వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాన్‌ల నిర్మాణాలు సైతం పూర్తాయ్యాయి. మిగిలిన రెండు దశల నిర్మాణాలు పూర్తి కాగానే ఆరు నెలల్లోపు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వం పలు దఫాలుగా మిషన్ భగీరథపై సమీక్ష సమావేశాలు నిర్వహించి ఆ దిశగా యంత్రాంగాన్ని పురమాయిస్తోంది. అన్ని అవరోధాలు అధిగమించి నాలుగు నెలల్లోగా పనులు మొత్తం పూర్తయితే ఇక గ్రామీణ తాగునీటి సమస్యక శాశ్వత పరిష్కారం లభించనుందంటున్నారు.

● ఎస్సారెస్పీ గ్రిడ్‌లో మొదటిదశ పూర్తి

భోథ్, నిర్మల్, ఆదిలాబాద్ సెగ్మెంట్‌లకు సంబంధించి ఎస్సారెస్పీ గ్రిడ్ పనులు పూర్తయ్యాయి. నిర్మల్ జిల్లా సోన్ మండలం లోకల్‌వెల్మల్ వద్ద ఇంటెక్‌వెల్ నిర్మాణ పనులు చేపట్టారు. అలాగే దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామం వద్ద చేపట్టిన నీటిశుద్ధి కేంద్రం పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. మొత్తం ఈ గ్రిడ్ కింద 931 ఆవాసాలకు తాగునీరు అందించనున్నారు. అలాగే ముథోల్ సెగ్మెంట్ కోసం గడ్డెన్న వాగు ప్రాజెక్టు భైంసా వద్ద ఇంటెక్‌వెల్ నిర్మించారు. వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాంట్ పనులు 50 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు మరో నెలలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా ఈ గ్రిడ్ నుంచి ముథోల్ సెగ్మెంట్‌లోని 245 గ్రామాలకు తాగునీరు అందించనుంది.

● కడెం గ్రిడ్‌తో ఖానాపూర్ సెగ్మెంట్‌కు..

కడెం ప్రాజెక్టు వద్ద చేపట్టిన ఇంటెక్‌వెల్ నిర్మాణం పూర్తికాబోతుంది. ఇక్కడి నుంచి పెద్దూర్ వద్ద చేపట్టిన వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాంట్‌కు నీరు చేర్చి శుద్ధి చేస్తారు. ఇక్కడి నుంచి పైప్‌లైల్‌ల ద్వారా జన్నారం, కడెం, ఖానాపూర్, దస్తూరాబాద్, పెంబి మండలాలకు సురక్షిత నీరు అందించనున్నారు. జూన్ మాసాంతం వరకు మొత్తం పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● మంచిర్యాల సెగ్మెంట్‌కు..

మంచిర్యాల సెగ్మెంట్‌కు శ్రీపాద ఎల్లంపెల్లి ప్రాజెక్టు నుంచి తాగునీరు అందించనున్నారు. ఎల్లపెల్లి గ్రిడ్‌లో భాగంగా గుడిపేట హాజీపూర్ వద్ద ఇంటెక్‌వెల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. హజ్పీపూర్‌లో వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాంట్ పనులు పూర్తికావచ్చాయి. అలాగే జిఎల్‌్రబిఆర్, ఓహెచ్‌బీఆర్ (ఓవర్ హెడ్ బ్యాలెన్స్ రిజర్వాయర్) పనులను పురోగతిలో ఉన్నాయి. అలాగే మొత్తం 11 పంపుల పనులు శరవేగంగా సాగుతున్నాయి.

● 21 మండలాలకు 'కొమురంభీం' నుంచి..

ఆసిపాబాద్ సెగ్మెంట్‌లోని ఏడు మండలాలకు తాగునీరు అందించేందుకు గాను మాణిక్ గూడ వద్ద గల అడ ప్రాజెక్టు నీరును వినియోగించనున్నారు. దీని కోసం గాను మాణిక్ గూడ గ్రామం వద్ద ఇంటెక్‌వెల్‌ను నిర్మించారు. మొత్తం 21మండలాలకు ఈ గ్రిడ్ కింద తాగునీరు అందించనున్నారు. మొత్తం 1819 ఆవాసాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ గ్రిడ్ ద్వారా దాదాపు అన్ని గిరిజన గ్రామాలకు రక్షిత తాగునీరు అందించనుంది.

(- ఆంధ్రజ్యోతి, నిర్మల్)



ట్రీ గార్డుల అపహరణ

భైంసా: హరితహారంలో భాగంగా నాటుతున్న మొక్కలను సంరక్షించేందుకు గాను ఏర్పాటు చేస్తున్న ట్రీగార్డులు అపహరణకు గురవుతున్నాయి. అటవీశాఖ మొక్కలను సంరక్షించేందుకు గాను ఆయా ప్రాంతాల్లో నాటిన మొక్కలకు కర్ణాటక రాష్ట్ర విధానంలో మొక్కలను నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేస్తున్నారు. అయితే చోరులు రాత్రివేళల్లో మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీగార్డులను తస్కరించుకపోతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలోని రోడ్డు మార్గంలో గల ట్రీగార్డులు చోరీకి గురవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతుండటంతో మూగజీవాలు తినిస్తున్నాయి. ఇటీవల సీఎం కేసీఆర్ ట్రీగార్డులను చోరీ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో దీనికి సంబంధించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు అటవీ శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే వందకు పైగా ట్రీగార్డులు చోరీకి గురైనట్లుగా తెలిసింది.

కుప్టి ప్రాజెక్టుపై కూనరిల్లుతున్న ఆశలు

● మూడేళ్లు గడిచినా..
నెరవేరని అధికార పార్టీ నేతల హామీలు
● ప్రాజెక్టు నిర్మిస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామలం

ఆదిలాబాద్ జిల్లాలో ప్రవహించే కడెం నదిపై కుప్టి జలాశయాన్ని నిర్మిస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించి మూడేళ్లు గడుస్తున్నా.. ఆ ముచ్చట మాత్రం తీరడం లేదు. ఇదిగో ప్రాజెక్టు... అదిగో నిర్మాణం అంటూ అధికార పార్టీ నేతలు ఆశ చూపుతున్నారే తప్ప ప్రాజెక్టు నిర్మాణానికి పునాదులు వేయడంలో విఫలమవుతున్నారు. నేరడిగొండ మండలం కుప్టి గ్రామం వద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టును నిర్మిస్తే విద్యుత్ ఉత్పత్తితో పాటు బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలాల్లో వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువవుతోంది. సరిపడా నీటి వనరులు ఉన్న కడెం నదిపై కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తే మరో 1,200 ఎకరాలకు సాగు నీరు అందనుంది. అలాగే దాదాపు 18 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనే నిపుణుల బృందం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ ప్రాధాన్యతను గుర్తించి గతేడే సర్వే పనులు పూర్తి చేసింది. దాదాపు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో అంచనా వేసి ప్రభుత్వ పరిపాలన అనుమతుల కోసం నివేదికలు అందజేశారు. ఇప్పటికే భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు కుప్టి గ్రామాన్ని సందర్శించి ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయిన ఇప్పటి వరకు పునాది రాయి పడలేదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే తమ బతుకులు బాగు పడుతాయని భావించిన అన్నదాతల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇప్పటి వరకు ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వక పోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.


● ప్రాజెక్టు పూర్తయితే బహుళ ప్రయోజనాలు

కుప్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతే బోథ్ నియోజక వర్గం సస్యశ్యామలం మారుతుంది. అలాగే భూగర్భ జలాలు సమృద్ధి గా పెరుగుతాయి. ఎత్తిపోతల ద్వారా మరిన్ని ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. ఏటా వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం గోదావరి పాలు కాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. నదికి ఇరు వైపుల ఎత్తైన కొండలు ఉండడంతో ప్రాజెక్టు నిర్మాణం కూడా తక్కువ వ్యయంతోనే పూర్తవుతుంది. కడెం జలాశయానికి నిరంతరం నీరందించడం వలన కడెం ఆయకట్టుకు భరోసా కల్పించవచ్చు. అదనంగా ఆయకట్టు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అలాగే విద్యుత్ ఉత్పత్తికి ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉంటుంది. ఈ నది మీదుగానే 44వ జాతీయ రహదారి వెళ్లడంతో ఉత్తర, దక్షిణ భారత దేశానికి ప్రయాణించే పర్యటకులకు పర్యటక ప్రదేశంగా నిలుస్తుంది. దిగువన ఉన్న గ్రామాలతో పాటు సమీప గ్రామాలకు మూడు కాలాల పాటు సాగు, తాగునీటికి కరువు లేకుండా ఉంటుంది.

● కుంటాలకు నిరంతర జలకళ

రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన జలపాతంగా పేరున్న కుంటాల జలపాతానికి నిరంతరం నీరంది జలకళను సంతరించుకోనుంది. యేడాదిలో 6నెలలు మాత్రమే పరవళ్లు తొక్కే కుంటాల ఈ ప్రాజెక్టు నిర్మాణంతో యేడాది పాటు జలకళతో కలకలలాడుతూ పర్యటకులను ఆకర్షిస్తుంది. దీంతో పర్యటకుల తాకిడి మరింత పెరిగి అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ దిశగా పాలకులు సీరియస్‌గా దృష్టి సారిస్తే కుంటాల జలపాతానికి మరింత పర్యటక శోభరానుంది.

(- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)



● కుప్టి ప్రాజెక్టు నిర్మాణ పూర్తయితే మా బాధలు తీరుతాయి

- రాథోడ్ రాందాస్, రైతు, దేవుల్‌నాయక్ తండా, నేరడిగొండ మండలం

కుప్టి ప్రాజెక్టు నిర్మాణం అయితే పూర్తిగా మా బాధలు తీరిపోతాయి. అలాగే బోథ్ నియోజక వర్గంలోని రైతులకు సాగునీరు, తాగునీరు సమస్యలు దూరమవుతాయి. గత మూడేళ్ల నుంచి పాలకులు ప్రాజెక్టు నిర్మాణం చేస్తామంటున్నారు. కానీ, ఇప్పటికీ స్పష్టత లేదు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు కుప్టి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని సందర్శించి వెంటనే ప్రాజెక్టు నిర్మానానికి గ్రీన్ సిగ్నల్ అందించినా.. నేటికీ కుప్టి ప్రాజెక్టుకు పునాదులు పడడం లేదు.

● నిరంతర జలకళను సంతరించుకోనున్న కుంటాల జలపాతం

- సాబ్లె నానక్‌సింగ్, రైతు, కోర్టికల్ గ్రామం, నేరడిగొండ మండలం



నేరడిగొండ మండలంలోని కడెం నది పరివాహక ప్రాంతమైన కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే కుంటాల జలపాతానికి ఎళ్లప్పుడు జలకళ సంతరించుకుంటుంది. చుట్టు పక్కల గ్రామాలకు సాగునీటితో పాటు తాగునీరు అందుతుంది. కుప్టి ప్రాజెక్టుపై పాలకులు స్పష్టత ఇవ్వాలి.

పత్తా లేని వరుణుడు.. పత్తి రైతుల ఆందోళన

❖ పక్షం రోజులుగా వర్షం కురువక రైతుకు అగ్ని పరీక్ష ❖ ఎండుముఖం పడుతున్న పంట ❖ మరోపక్క కూలీల కొరత

ముథోల్: పత్తి రైతుకు కష్టకాలం వచ్చింది. మొదట ఆశ చూపిన వరుణుడు సుమారు పక్షం రోజుల నుంచి దోబూచులాట ఆడడంతో పత్తి రైతన్న పరేషాన్ అవుతున్నాడు. మొదట వరుణ దేవుడు తొలకరి చినుకులతో రైతన్నకు ఆశలు రేకెత్తించడంతో అప్పుచేసి పత్తి విత్తనాలను విత్తాడు. ప్రస్తుతం పత్తి పంటకు వర్షం అవసరం. కాని వర్షం కురియకపోవడంతో ఎదిగిన పత్తి మొక్కలు ఎండ తాకిడికి ఎండుముఖం పడుతున్నాయి. పక్షం రోజుల్లో వర్షం కురియకపోతే పత్తి పంట నిలువునా ఎండిపోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం చవక నేలలు, ఎర్ర నేలలు, సౌడు నేలల్లో పత్తి పంట ఎండ తాకిడికి వాడిపోయినట్లు కనబడుతున్నాయి. ప్రతిరోజు రైతు దిగులుతో వర్షం కోసం వరుణ దేవా కరుణించవా అన్న దీనస్థితిలో ఆకాశం వైపు చూస్తున్నారు. అంతేకాకుండా గంపెడు ఆశలతో ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టిన రైతన్నకు ప్రస్తుతం ఆశలు ఆవిరవుతున్నాయి. మరోపక్క కూలీలు దొరకక పంటపొలాల్లో కలుపు మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మరోపక్క వర్షం కురియక పంట ఎండుముఖం పడుతుంది. రైతు పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. ఏది ఏమైనా పక్షం రోజుల్లో వర్షాలు కురువకపోతే పెట్టిన పెట్టుబడి.. పెరిగిన పత్తి పంట పోయే పరిస్థితి ఉందని రైతులు కలవరపడుతున్నారు.

వానమ్మా.. రావమ్మా!!



వర్షాలు కురవకపోవడంతో ముథోల్ ఏరియాలో యేపుగా పెరగని పత్తి పంట

● రూ.50వేల పెట్టుబడితో 6 ఎకరాల్లో పత్తి వేశా

- అర్జున్, చించాల, రైతు



ఆరున్నర ఎకరాలలో సుమారు రూ.50 వేల పెట్టుబడితో పత్తి పంట వేశా. వర్షం కురువక పత్తి పంట ఎండుముఖం పడుతోంది. గత సంవత్సరం చేసిన అప్పులు ఈ సంవత్సరమైనా తీరుతాయన్న గంపెడాశతో పత్తి పంట వేశా. కానీ వర్షం కురువక.. వేసిన పత్తి పంట వాడిపోతోంది. మరో పది పదిహేను రోజుల్లో వర్షం కురిస్తే పత్తి పంట చేతికి వస్తుంది, లేదంటే నష్టపోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది.

● ఇకనైనా వర్షం కురిస్తే పర్వాలేదు

- మొగులాజీ, తరోడ, రైతు



రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి రెండెకరాలలో పత్తి పంట వేశా. చౌక నేలలు కాబట్టి వర్షాలు లేక ఎండ తాకిడికి పంట వాడిపోతోంది. వారంలో వరుణుడు కరుణిస్తే పత్తి పంటకు ఢోకా లేదు. రోజూ వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నా. అప్పులు తీరుతాయన్న ఆశతో ఈ యేడు పత్తి పంట వేశా. కానీ వరుణుడు మా ఆశలను అడియాశలు చేస్తున్నాడు. ఇదే జరిగితే ఇంకా అప్పుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

జిల్లాలో నత్తనడకన గొర్రెల పంపిణీ

● మొత్తం 14,442 మంది లబ్ధిదారులు ● మొదటి విడత 7,148 మంది ఎంపిక



నిర్మల్ అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గొల్ల కుర్మ సంక్షేమం కోసం, వారికి ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం నిర్మల్ జిల్లాలో నత్తనడకగా కొనసాగటంతో లబ్ధిదారులలో ఆందోళన నెలకొంది. జిల్లాలో సారంగాపూర్ మండలంలో జూన్ 20న జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదగా మొదట ఐదుగురు లబ్ధిదారులకు గోర్రెలను అందజేశారు. జిల్లా మొత్తం 14,442 మంది లబ్ధిదారులుకాగా మొ దటి విడతగా 7,148 లబ్ధిదారులకు గొర్రెలు ఇవ్వాలని నిచ్చయించారు. ఒక యూనిట్ విలువ 1.25 లక్షలు కాగా ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇవ్వగా 25 శాతం లబ్ధిదారుడు బరించాలి. ఒక యూనిట్‌లో (20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలు) జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దు జిల్లాలైన సాంగ్యి, సతరాలను కేటాయించారు. అక్కడ తగినన్ని జీవాలు అందుబాటు లేక లబ్ధిదారులు వెళ్లి తిరిగి వచ్చారు. పథకం ప్రారంభానికి ముందు అక్కడ తక్కువ ధరకు లభించే గొర్రెలను, నిర్మల్ ప్రాంతం నుంచి అధికారులు కొనుగోలుకు వేళ్లటంతో అమ్మకందారులు గొర్రెల ధరలను పెంచేశారు. ముందు రూ.4వేలకు లభించే ఒక గొర్రె ధరను రూ.6వేలకు పెంచారు. పొట్టేలు ధర రూ.8వేల నుంచి రూ.10 వేలు చేశారు. అయినా జీవాలు తగినన్నీ లభ్యం కాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆడ గొర్రెకు రూ.5,200, పొట్టేలుకు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు చెల్లించవచ్చు. అందులో రవణా, బీమా ఖర్చులు కూడా కలిపి చెల్లిస్తారు. పథకం ప్రారంభించి నెలన్నర దాటినా ఇంతవరకు జిల్లాలో 300 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారు. పక్క జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, సిరిసిల్లా రాజన్న, జగిత్యాల్‌లో వెయ్యి యూనిట్లకుపైగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గొర్రెల పంపిణీ జాప్యంపై జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి జాఫర్ హుస్సేన్‌ను వివరణ కోరగా మహారాష్ట్రలో కేటాయించిన సతరా, సాంగ్యలో సరిపడా గొర్రెలు లభించటంలేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. కలెక్టర్ చొరవతో అనంతరం మంచి గొర్రెలను కోనుగోలు చేయడం కోసం వెళతామన్నారు. అక్కడ సరిపడా గొర్రెలు ఉన్న మిగితా జిల్లాల లబ్ధిదారులు వెళ్లడంతో డిమాండ్ పెరిగింది. పంపిణీలో జాప్యం నివారించి పంపిణీని వేగవంతం చేస్తామన్నారు.

కల్తీ చేస్తే.. అడ్రస్ గల్లంతే!

● నిర్మల్ పట్టణంలో విస్తృత తనిఖీలు

నిర్మల్ కల్చరల్: ప్రభుత్వం కొనుగోలు చసే నిత్యావసర వస్తువుల్లో కల్తీ చోటు చేసుకోవడంపై అధికారులు దృష్టి సారించి బుధవారం జిల్లా కేంద్రంలో విస్తృత తనిఖీలు చేశారు. పట్టణ కేంద్రంలోని మారుతి ట్రేడర్స్, హోల్‌సేల్ కిరాణ దుకాణంలో ఆహర శాఖ అధికారులు, పోలీసు అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించారు. గత కొంతకాలంగా నిర్మల్‌లో కల్తీ రాజ్యమేలుతుందన్న సమాచారం మేరకు కల్తీ రక్కసిపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు నడుం బిగించారు. ఒకవైపు కాలం చెల్లిన వస్తువులను ప్రజలకు విక్రయించడంతో పాటు కల్తీ జోరుగా సాగుతుందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఈ దాడులకు పూనుకున్నారు. మారుతి ట్రేడర్స్‌లో ఏ నూనెలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. దుకాణాల్లో తనిఖీ సమయంలో నూనె నమూనాలు సేకరించి వాటిని హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపనున్నామన్నారు. నివేదికల ఆధారంగా తగు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. కల్తీ సరుకులు విక్రయించే వారి అడ్రస్ గల్తీ అవుతుందని హెచ్చరించారు. జీఎస్టీ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వారు వ్యాపారస్థులకు గుర్తు చేశారు. ఈ తనిఖీలో జిల్లా ఆహర భద్రత అధికారి బాపూజీ, పట్టణ సీఐ జాన్‌దివాకర్ పోలీసులు పాల్గొన్నారు.



నిర్మల్ పట్టణంలోని మారుతి ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార భద్రత శాఖ అధికారులు, పోలీసులు

తట్టు, రుబెల్లా టీకాపై అవగాహన కల్పించండి : జేసీ

నిర్మల్ కల్చరల్: ప్రజలకు తట్టు, రుబెల్లా టీకాలపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ కాన్ఫిరెన్స్‌లో జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు. ఆగస్టు నుంచి 17నుంచి సెప్టెంబర్ 23వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జెసీ తెలిపారు. సామాజిక మాధ్యమాల , వాల్ పోస్టర్లు , సినిమా థియేటర్‌లలో పాటు ప్రదాన కూడళ్ళ వద్ద ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళ సంఘాలను ప్రచారానికే ఉపయోగించుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూపై వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత మంచినీరు, పంచాయతీ, వైద్య అధికారుల సమావేశంలో పలు సూచనలు చేశారు. వర్షకాలంలో మలేరియా, డెంగ్యూ ప్రజలే అవకాశమున్నందున తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు కృషి చేయాలన్నారు. లార్వా సమయంలోనే వాటిని అంతం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాల్వలు, డ్రైనేజీలు శుభ్రపర్చేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. మున్సిపల్ పరిధిలో కమిషనర్ గ్రామ పరిధిలో జిల్లా పంచాయతీ అధికారులు పరిశుభ్రత చర్యలపై పర్యవేక్షించాలని పేర్కొన్నారు. బోర్ బావుల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా వ్యాధి గ్రస్థుల గురించి రక్త పరీక్షలు చేయించాలని వైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని వివరించారు. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించాలని వైద్య అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య ఉప అధికారి జలపతి నాయక్, మలేరియా అధికారి సురేష్, డిపిఓ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె శ్రీనివాస్, సంక్షేమాధికారి విజయలక్ష్మి, కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, తదితరులున్నారు.



మాట్లాడుతున్న జేసీ శివలింగయ్య

● 'ఉద్యమంలా మొక్కల పెంపకం'

దిలావర్‌పూర్: మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివలింగయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం జేసీ మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ఒక సామాజిక బాధ్యతగా భావించి హరిత తెలంగాణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నర్సయ్య, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నర్సయ్య ఏఎంసీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ పాల్దె లక్ష్మీ, సర్పంచ్ నంద అనిల్, తదితరులున్నారు.

'పనుల ను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి'

కుభీర్: ఊట కుంటల పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో మేఘా వాటర్‌షెడ్ పథకంల ద్వారా రూ.20 లక్షలతో చేపడుతున్న నాలుగు ఊట కుంటల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకు ముందు మండలంలోని గోడాపుర్ గ్రామంలో చేపడుతున్న ఈజీఎస్ పనులను పరిశీలించి కూలీలకు డబ్బులు బ్యాంక్ ఖాతా ద్వారా చల్లించేల చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వంటశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండల పరిషత్ కార్యలయంలో ఈజీఎస్, ఐకేపీ, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాలకు మంజూరైన వైంకురథామం (శ్మశాన వాటిక) పనులు సకాలంలో పూర్తి చేయలన్నారు. ఈ పథకంలో చేపడుతున్న పనులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీవో నవీన్, ఏఎన్ఎం సృజన్‌కుమార్ రెడ్డి, స్వచ్ఛభారత్ జిల్లా అధికారి దేవేందర్, నాయకులు మోహియోద్దిన్, తూం రాజేశ్వర్, ఎన్నిల అనిల్ స్థానిక సర్పంచ్ గోరేకర్ బాబు, వాటర్ షెడ్ చైర్మన్ దొంతుల లింగన్న, తదితరులు ఉన్నారు.

'పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

కడెం: సారంగాపూర్ ప్రాథమిక పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని సారంగాపూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఇటీవల గ్రామస్థులు బడిబాట కార్యక్రమంలో భాగంగా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపమని ప్రభుత్వం పాఠశాలకు పంపుతామని తీర్మానం చేశారు. అలాగే తమ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని డీఈవోను కోరగా బుధవారం పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలకు ప్రహరీ, వండ షెడ్ నూతన పాఠశాల భవనం కావాలని గ్రామస్థులు కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే పాఠశాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థులు అంతా కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపడం గొప్ప విషయమని అభినందించారు. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సారంగాపూర్ గ్రామస్థులను స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. అనంతరం పాఠశాల కమిటీ, గ్రామస్థులు డీఈవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ జెట్టి నర్సయ్య, గ్రామస్థులు కోల శ్రీనివాస్, కొప్పుల లక్ష్మి, నర్సయ్య, నారాయణ, మార్కపు రాజు, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.



హరితహారంలో భాగంగా ర్యాలీ తీస్తున్న విద్యార్థులు (ఫైల్)

యువత కదం.. అభివృద్ధి పథం!

- యువకులు దిద్దిన తాటిగూడెం
- ఎటుచూసినా పచ్చదనం
- సంపూర్ణ మద్యనిషేధం
- 100శాతం ఫలితాలతో ఆదర్శం

కాసిపేట: యువత కదంతొక్కడంతో ఆ గూడెం అభివృద్ధి పథాన సాగుతున్నది. ఎటుచూసినా పచ్చదనంతో కళకళలాడుతున్నది. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా గ్రామంలో ఉన్నత విద్యావంతులైన యువకులంతా చేయీ చేయీ కలిపారు. హరితహారం కింద వందలాది మొక్కలు నాటి సంరక్షించారు. రాత్రి పూట వయోజనులకు చదువు చెప్పి, 100శాతం అక్షరాస్యత సాధించారు. 100శాతం మరుగుదొడ్లు నిర్మింపజేశారు. సంపూర్ణ మద్య నిషేధం అమలుచేయించారు. ఫలితంగా ఎక్కడో విసిరేసినట్లున్న ఈ గూడెంపేరు జిల్లావ్యాప్తంగా మారుమోగింది. ఉమ్మడి జిల్లాలో ఉత్తమ గ్రామంగా కూడా ఎంపికైంది.

కాసిపేట మండలం కోనూరు పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమే తాటిగూడెం. ఇక్కడ 66 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. మొత్తంగా 334 జనాభా ఉంది. మూడేళ్ల క్రితం ఇక్కడో



పచ్చదనంతో గ్రామంలోని వార్డు

గిరిజన గ్రామం ఉన్నట్లు బాహ్యప్రపంచానికి తెలిసేది కాదు. కానీ గ్రామయువకుల సమష్టి కృషితో ఈ గూడెం, యావత్ జిల్లా దృష్టిని ఆకర్షించింది. ఉమ్మడి జిల్లాలో ఉత్తమ గ్రామంగా ఎంపికైంది. గ్రామంలో ఉన్నత విద్య అభ్యసించిన యువకులంతా కలిసి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. మొదటి, రెండోవిడత హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా 30 పారిజాతం, 20 అల్లనేరెడు, 40వేప, 60 సుబాబుల్, 200 కానుగ, 50 నిమ్మ, 300 రకాల సీజనల్ పూల మొక్కలు నాటారు. ఈ గూడానికి చెందిన సిడాం రాము బెజ్జూరు మండలంలో సహాయ వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తన ఇంటిని పూల మొక్కలతోనే పొదరిల్లుగా తీర్చిదిద్దారు. ఇంటి చుట్టూ గోడ నిర్మాణానికి బదులు, తీగచెట్లనే ప్రహరీగా మలిచారు. ఇక గ్రామం లోని యువకులు, సమష్టిగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. గ్రామంలో వందశాతం అక్షరాస్యత సాధించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుచేశారు. వందశాతం మరుగుదొడ్లతోపాటు 100 శాతం ఇంకుడుగుంతలను నిర్మించి, గ్రామాన్ని ఆదర్శంగా నిలిపారు. గోండుల ఆరాధ్య దైవం కుమరంభీం విగ్రహాన్ని చౌరస్తాలో ప్రతిష్ఠించారు. యువకుల కృషిని ప్రశంసించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శాలువాలతో సత్కరించారు. ప్రతిఒక్కరూ తాటిగూడెం గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకొని హరిత తెలంగాణకు కృషిచేయాలని నియోజకవర్గ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

అందరి సహకారం వల్లే

-మడావి వెంకటేశ్, ఆదివాసీ ఏకలవ్యయూత్ అధ్యక్షుడు




గ్రామస్తులందరి సహకారం వల్లే 'ఆకుపచ్చ తాటిగూడెం' సాధ్యమైంది. ఎవరో వస్తారు, ఏమోచేస్తారని ఎదురుచూడకుండా మా గ్రామాన్ని మేమే దత్తత తీసుకొని అభివృద్ధి చేసుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలపైనా ప్రచారం చేస్తున్నాం. అధికారులు సహకరిస్తే రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతాం.

యువతకు ఉపాధి కల్పించాలి

- సిడాం రమేష్, ఆదివాసీ ఏకలవ్యయూత్ ప్రధాన కార్యదర్శి



తాటిగూడెంలో యువకులందరూ విద్యావంతులే. ఉన్నతవిద్య అభ్యసించిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. ఆర్థికంగా బలోపేతమైతేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. మా గూడెంతోపాటు మరిన్ని గిరిజన గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పథకాల గురించి తెలుపుతున్నాం. మద్య పానం వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తున్నాం. రాత్రివేళల్లో వయోజనులకు చదువు నేర్పిస్తున్నాం.



రైల్వే ట్రాక్ పక్కన అల్లుకున్న తీగలు

ఇంట్లో, కాలనీల్లో, కార్యాలయాల్లో, రహదారుల వెంట పచ్చని చెట్లు ఉంటే ఆ అందమే వేరు. చల్లని నీడ, స్వచ్ఛమైన గాలికి కొదవ ఉండదు. ప్రజల్లో మొక్కల పెంపకంపై కొన్నేళ్లుగా శ్రద్ధ పెరుగుతున్నది. ఈక్రమంలో వచ్చిన హరితహారం మరింత స్ఫూర్తి నింపుతున్నది. ఫలితంగా మంచిర్యాల పట్టణంలో రోజురోజుకూ పచ్చదనం విస్తరిస్తున్నది. పలు ఇండ్లు, కాలనీలు, పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో పోటీ పడి మొక్కలు పెంచడం కనిపిస్తున్నది. ఏ కొద్ది పాటి స్థలం ఉన్నా ఏదో ఒక మొక్కనాటడం పరిపాటిగా మారింది. ఫలితంగా జిల్లాకేంద్రం కాస్తా అలంకరణ, పూల మొక్కలతో పాటు పచ్చని చెట్లతో శోభాయమానంగా దర్శనమిస్తున్నది. పట్టణవాసులంతా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తే కొన్నేళ్లలోనే మంచిర్యాల కాస్తా నందనవనంగా మారుతుంది.

పచ్చని పట్టణం

ఫొటోలు: శ్రావణ్(ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)



పచ్చని చెట్ల మధ్య డీసీపీ కార్యాలయం



ఎంసీసీ కంపెనీ ఏరియాకు వెళ్లే దారిలో..



మంచిర్యాలలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో..



ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో..



పట్టణంలోని ఓ ఇంటి ఆవరణలో..



అమ్మ గార్డెన్స్‌లో ..



ఐబీ ప్రాంగణం



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం..



ఓ ప్రైవేట్ నర్సరీలో పచ్చదనం



రెడ్డి కాలనీలో..



దారి కనుక్కోండి



ఔనా!

బంగారం నిల్వలు ఎక్కువగా ఉన్న దేశాల్లో భారతదేశ స్థానం 11.



చెప్పగలరా?

సూదిలో ఉన్నా కానీ దూదిలో లేను
చరణంలో ఉన్నా కానీ మరణంలో లేను
నరంలో ఉన్నా కానీ వరంలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?



ప్రతి వంద మందిలో..

ప్రపంచంలో ప్రతి విషయమూ వింతే. మనుషుల రంగు నుంచి తినే తిండి దాకా అన్నింటి గురించి అందరికీ ఆసక్తే. ప్రపంచంలో ఎన్ని ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు ఉన్నాయి? ఎంతమంది కాలేజీ విద్యను అభ్యసిస్తున్నారు? కంప్యూటర్లు ఎంతమంది కలిగి ఉన్నారు?

ప్రపంచాన్ని ఓ గ్రామంగా ఊహించుకుంటే..
అందులో ఉన్నది ఓ వంద మంది అయితే..



మేని ఛాయ (స్కిన్ కలర్)

తెలుపు - 30
తెలుపు రంగు కాకుండా - 70



జాతీయత

ఆసియన్లు - 61
యూరోపియన్లు - 12
ఆఫ్రికన్లు - 13
ఉత్తర/ దక్షిణ అమెరికన్లు - 13
ఆస్ట్రేలియా, పసిఫిక్ ఐలాండ్స్ వాసులు - 1



కంప్యూటర్

సిస్టమ్ కలిగి ఉన్నవాళ్లు - 7
లేని వాళ్లు - 93




విద్య

కాలేజీ విద్య అభ్యసిస్తున్న వారు - 1
హైస్కూలింగ్‌తో ఫుల్‌స్టాప్ పెట్టినవాళ్లు - 99




హెచ్‌ఐవీ

(హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్)
సోకిన వాళ్లు - 1
హెచ్‌ఐవీ లేనివాళ్లు - 99



ఆహారం

స్థూలకాయం(ఓవర్ వెయిట్) - 15
ఎప్పుడూ సంపూర్ణంగా ఆహారం ఉన్నవాళ్లు - 30
అనంత ఆహారం కొరత ఉన్నవాళ్లు - 50
కొన్ని సమయాల్లో ఆహారం దొరకని వాళ్లు - 20
ఆకలితో అలమటించి మరణించే వారు - 1




స్వేచ్ఛ

స్వాతంత్ర్యంగా ఉన్నోళ్లు - 52
స్వేచ్ఛగా మాట్లాడలేని వాళ్లు - 48
(చిత్రవధ, జైలు శిక్ష, మరణ శిక్ష వంటి కారణాలతో వీళ్లు సరిగా మాట్లాడలేరు)




అక్షరాస్యత

అక్షరాస్యులు - 86
నిరక్షరాస్యులు - 14




విద్యుత్

విద్యుత్ ఉన్న ప్రాంతాలు - 76
కరెంటు లేని ప్రాంతాలు - 24



లైంగికత

మహిళలు - 52
పురుషులు - 48



నవ్వుల్ నవ్వుల్

వీరేందర్ : నేను ఏడాదికోసారి కచ్చితంగా రక్తదానం చేస్తాను రా!

మిస్టర్ మేధావి : దానికి అంత గొప్పగా చెప్పుకుంటున్నావా? నేనైతే ప్రతిరోజూ చేస్తాను ఏమనుకున్నావో!

వీరేందర్ : అలా ఎలా చేస్తావురా?

మిస్టర్ మేధావి : నేను చేసేది దోమలకు రా!

వీరేందర్ : !!!!!!!!!!

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. గంభాభూ ....
2. లఆస్యం ....
3. మాదంప్ర ....

మీకుతెలుసా?

రోజూ మనదేశంలో తిరిగే రైళ్ల సంఖ్య దాదాపుగా 12,000




జవాబులు

చెప్పగలరా? : సూచన జంతర్‌మంతర్ : 1. భూభాగం 2. ఆలస్యం 3. ప్రమాదం

రంగులు వేయండి



బొమ్మ గీయండి



పదాలు కనుక్కోండి

M	B	C	R	I	B	V	S	K	U	F	R	D
V	O	U	P	E	G	E	Z	K	L	U	A	K
E	N	T	Z	M	L	A	L	W	R	T	N	O
J	E	E	R	V	W	T	A	I	T	F	J	N
A	S	L	C	E	G	R	T	N	M	O	G	M
M	I	G	R	V	C	Y	A	A	W	S	Q	I
K	E	Y	P	I	K	N	P	X	R	N	R	Z
E	L	G	G	I	G	L	U	E	Z	U	Q	A
R	A	A	J	E	K	J	P	O	I	G	Q	U
U	B	J	R	U	N	A	Y	O	B	G	E	Q
C	O	P	A	C	I	F	I	E	R	R	L	A
H	R	L	I	D	G	M	Y	F	W	E	M	W
Y	B	A	B	O	T	T	L	E	J	E	D	G

BABY	CUTE	PREGNANT
BOTTLE	DIAPERS	PACIFIER
BOUNCER	GIGGLE	RATTLE
BOY	GIRL	SMILE
CRAWL	LABOR	SNUGGLE
CRIB	ONESIE	SOFT

‘ఫోర్బ్స్’ ప్రపంచ ధనవంతుల జాబితాలో తొలిస్థానం ఎవరిది?



ఎస్.మహిపాల్ రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. ‘మ్యాన్ బుకర్ ప్రైజ్-2017’ ఎంపిక జాబితాలో నిలిచిన భారత రచయిత్రి అరుంధతిరాయ్ రచించిన పుస్తకం?
   ఎ) ద షేప్ ఆఫ్ ద బీస్ట్
   బి) ద చెక్‌బుక్ అండ్ ద క్రుయిజ్ మిస్సైల్
   సి) ద మినిస్ట్రి ఆఫ్ అట్ మోస్ట్ హ్యాపీనెస్
   డి) బ్రోకెన్ రిపబ్లిక్
2. ప్రధాని రేడియో ప్రసంగాలను పొందుపరుస్తూ ఇటీవల వెలువడిన ‘మన్ కి బాత్ ఎ సోషల్ రెవల్యూషన్ ఆన్ రేడియో’ను రచించింది?
   ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) ఎ.సూర్యప్రకాశ్
   సి) కె.సి.మాథుర్ డి) రాజేష్ జైన్
3. మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం?
   ఎ) ఆగస్టు 2 బి) జూలై 30
   సి) జూలై 25 డి) ఆగస్టు 8

4. డిఆర్‌డిఒ రూపొందించిన తొలి స్వదేశీ మానవరహిత యుద్ధ ట్యాంక్?
   ఎ) వైజయంతి
   బి) మిథుల
   సి) మంత్ర
   డి) ఫారత్



5. డిఆర్‌డిఒకు సంబంధించి సరైనది?
   ఎ) డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్
   బి) స్థాపన - 1958 సి) డైరెక్టర్ - క్రిస్టోఫర్
   డి) పైవన్నీ
6. ప్రపంచ బ్యాడ్మింటన్ సంఘం ఇటీవల ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో పురుషుల విభాగంలో అత్యుత్తమంగా 8వ ర్యాంక్ ఎవరిది?
   ఎ) సాయిప్రణీత్ బి) పారుపల్లి కశ్యప్
   సి) కిదాంబి శ్రీకాంత్ డి) అజయ్ జయరాం
7. ప్రపంచ బ్యాడ్మింటన్ సంఘం ఇటీవల ప్రకటించిన మహిళల ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 5వ ర్యాంక్ పొందినది?
   ఎ) సైనా నెహ్వాల్ బి) సయాలి గోఖలే
   సి) పి.వి.సింధు డి) గుత్తా జ్వాలా
8. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరిగా ఆలపించాలని ఇటీవల ఏ హైకోర్టు తీర్పునిచ్చింది?
   ఎ) మద్రాస్ హైకోర్టు బి) అలహాబాద్ హైకోర్టు
   సి) కేరళ హైకోర్టు డి) ముంబై హైకోర్టు
9. ఆసియా నోబెల్‌గా పరిగణించే రామన్ మెగసెసె అవార్డుకు సంబంధించిన సరైనది?
   ఎ) 1958 నుంచి ప్రదానం బి) విభాగాలు - 6
   సి) తొలి భారత గ్రహీత - ఆచార్య వినోబా భావే (1958) డి) పైవన్నీ
10. అండర్ 19 ఆసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు 2018లో ఆతిథ్యం ఇస్తున్న దేశం?
   ఎ) ఇండోనేషియా బి) ఇండియా
   సి) ఫిలిప్పీన్స్ డి) సింగపూర్
11. ఇటీవల మరణించిన ఎన్.ధరంసింగ్ ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
   ఎ) పంజాబ్ బి) హర్యానా సి) కర్ణాటక డి) మహారాష్ట్ర
12. దేశంలోనే తొలిసారిగా ‘ఆన్ గో’ అనే మొబైల్ ఆధారిత టికెట్ వ్యవస్థను ప్రవేశపెట్టిన మెట్రో రైలు?
   ఎ) కోల్‌కతా మెట్రో బి) ఢిల్లీ మెట్రో
   సి) బెంగళూరు మెట్రో డి) ముంబై మెట్రో
13. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజి ఇటీవల 'India Quake' అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. సిస్మోలసిజి అంటే?
   ఎ) భూకంపాల అధ్యయన శాస్త్రం
   బి) మృత్తిక అధ్యయన శాస్త్రం
   సి) వాతావరణ అధ్యయన శాస్త్రం
   డి) జనాభా అధ్యయన శాస్త్రం
14. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం?
   ఎ) జూలై 29 బి) జూలై 30
   సి) జూలై 28 డి) ఆగస్టు 7
15. ఆసియాభివృద్ధి బ్యాంక్ గవర్నర్స్ బోర్డుకు భారత తరపున ఇటీవల ఎవరు నామినేట్ అయ్యారు?
   ఎ) శక్తికాంత్ దాస్
   బి) సుభాష్ చంద్రగార్గ్
   సి) అమితాబ్ కాంత్
   డి) అరవింద్ సుబ్రమణియం
16. ఆసియాభివృద్ధి బ్యాంక్‌కు సంబంధించి సరైనది?
   ఎ) స్థాపన - 1966
   బి) ప్రధాన కార్యాలయం - మనీలా (ఫిలిప్పీన్స్)
   సి) సభ్య దేశాలు - 67
   డి) పైవన్నీ
17. కార్గిల్ విజయానికి గుర్తుగా జూలై 26న విజయ్‌దివస్‌గా నిర్వహిస్తారు. అయితే కార్గిల్ విజయం కోసం సైన్యం చేపట్టిన కార్యక్రమం?
   ఎ) ఆపరేషన్ పరాక్రమ్ బి) ఆపరేషన్ విజయ్
   సి) ఆపరేషన్ రాహత్
   డి) ఆపరేషన్ సంకటమోచన్
18. బెంగాల్ ప్రభుత్వం అందించే ‘మహానాయక్ సమ్మాన్-2017’ అవార్డు గ్రహీత?
   ఎ) శరద్ పవార్ బి) విరాట్ కోహ్లి
   సి) శకుంతల బారువ డి) లతా మంగేష్కర్
19. ‘ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2021’కి ఆతిథ్యం ఇవ్వనున్న దేశం?
   ఎ) క్యూబా బి) ఇండియా సి) మంగోలియా డి) టర్కీ

జికె అండ్ కరెంట్ అఫైర్స్

20. దేశంలోనే తొలిసారిగా ప్రైవేటు రంగ సంస్థ రిలయన్స్ నిర్మించిన గస్తీ నౌకలు?
   ఎ) భారతి, కోకిల బి) శచి, శృతి
   సి) భారతి, సింధు డి) సింధు, సాగరిక
21. 'CANDI' అనే పేరుతో బెంగళూరు కేంద్రంగా తొలి డిజిటల్ బ్యాంకింగ్ శాఖను ప్రారంభించింది?
   ఎ) బ్యాంక్ ఆఫ్ ఇండియా బి) కర్ణాటక బ్యాంక్
   సి) కెనరా బ్యాంక్ డి) ఇండియన్ బ్యాంక్
22. కాంబోడియాలోని ఆంగ్‌కోర్‌వాట్ వంటి సాంస్కృతిక కేంద్రాల పరిరక్షణకు చేసిన కృషికి 2017లో ‘రామన్ మెగసెసె’ అవార్డు పొందింది?
   ఎ) గిత్సె షణ్ముగం(శ్రీలంక)
   బి) టోనిటౌ(సింగపూర్)
   సి) లిలియ లె డిమ(ఫిలిప్పీన్స్)
   డి) యొషియాకి ఇషిజావ(జపాన్)

23. యాక్సిస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా తిరిగి నియామకమైనవారు?
   ఎ) పి.ఎస్.జయకుమార్
   బి) దీనబంధు మహాపాత్ర
   సి) జైకుమార్ నర్గ్
   డి) శిఖాశర్మ



24. తీర ప్రాంత ప్రజలు, వర్గాలకు అన్ని రకాల సమాచారం, సలహాలు అందించడానికి కేంద్రం ప్రారంభించిన సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు?
   ఎ) సేతు సముద్రం బి) సాగరవాసి
   సి) సాగరిక డి) సాగర సహాయ్
25. సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ట్రాక్‌ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన రాష్ట్రం?
   ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
   సి) ఆంధ్రప్రదేశ్ డి) త్రిపుర
26. ఇటీవల మండే స్వభావం గల ఐస్(మిథేన్ హైడ్రేట్) నుంచి విజయవంతంగా సహజ వాయువును వేరు చేసిన దేశం?
   ఎ) జపాన్ బి) కెనడా సి) రష్యా డి) చైనా
27. పనామ పత్రాల లీకేజీ నేపథ్యంలో పదవి కోల్పోయిన పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఏ పార్టీకి చెందినవాడు?
   ఎ) పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ
   బి) తెహ్రిక్-ఎ-ఇన్సాఫ్
   సి) పాకిస్థాన్ ముస్లిం లీగ్
   డి) అవామి నేషనల్ పార్టీ
28. 2017 జూలై 27న ట్రాన్స్ జెండర్లు మిలటరీలో పనిచేయడానికి అనర్హులుగా ప్రకటించిన దేశం?
   ఎ) ఫ్రాన్స్ బి) నైజీరియా
   సి) అమెరికా డి) బొలీవియా
29. దేశ అత్యున్నత న్యాయమూర్తులను ఏ ఇతర సంస్థలతో సంప్రదించకుండానే నియమించే అధికారం అధ్యక్షుడికి అప్పగిస్తూ రాజ్యాంగాన్ని సవరించిన దేశం?
   ఎ) బొలీవియా బి) జింబాబ్వే
   సి) ఫిలిప్పీన్స్ డి) సింగపూర్
30. ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థల నుంచి పూర్తిగా విముక్తి పొందినట్లు ప్రకటించిన దేశం?
   ఎ) కొలంబియా బి) సోమాలియా
   సి) సిరియా డి) బొలీవియా
31. 2017 జూలై 27న ‘సిమోర్గ్’ అనే ఉపగ్రహ ఆధారిత రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన దేశం?
   ఎ) ఉత్తర కొరియా బి) ఇరాన్
   సి) పాలస్తీన డి) ఇజ్రాయెల్
32. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017 ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 8 వరకు ఏ వ్యాధుల కోసం ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది?
   ఎ) తట్టు, రూబెల్లా బి) తట్టు, హెపటైటిస్
   సి) రుబెల్లా, పోలియో డి) తట్టు, టెటానస్
33. హంగేరియన్ ఫార్ములా వన్ గ్రాండ్‌ప్రి-2017 విజేత?
   ఎ) లూయిస్ హామిల్టన్ బి) రైకోనిన్
   సి) సెబాస్టియన్ వెటెల్ డి) బొట్టాస్
34. ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనను ఇటీవల ప్రారంభించిన దేశం?
   ఎ) ఇండియా బి) చైనా సి) స్విట్జర్లాండ్ డి) జర్మనీ
35. ఇటీవల చైనాలోని ఫుజియల్ ప్రావిన్స్‌లో విధ్వంసం సృష్టించిన టైఫూన్?
   ఎ) హైటాంగ్ బి) నొమురా
   సి) తుయుయు డి) ఇయాంగ్

36. ‘ఫోర్బ్స్’ ప్రపంచ ధనవంతుల జాబితాలో తొలిస్థానంలో ఎవరిది?
   ఎ) బిల్‌గేట్స్(మైక్రోసాఫ్ట్)
   బి) జెఫ్ బెజోస్ (అమెజాన్)
   సి) వారన్ బఫెట్ (వాల్‌మార్ట్)
   డి) అజీం ప్రేమ్‌జీ(విప్రో)



37. ఆహార పదార్థాలు, పానియాల్లో ద్రవ నైట్రోజన్ కలపడంపై నిషేధం విధించిన రాష్ట్రం?
   ఎ) గుజరాత్ బి) హర్యానా
   సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్
38. ప్రపంచంలోనే 100 శాతం ‘గ్రీన్ రైల్వే’గా ఇటీవల గుర్తింపు పొందినది?
   ఎ) చెన్నై మెట్రో రైల్వే
   బి) బెంగళూరు మెట్రో రైల్వే
   సి) కోల్‌కత మెట్రో రైల్వే డి) ఢిల్లీ మెట్రో రైల్వే
39. 2017 జూలై 27, 28 తేదీల్లో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రత సలహాదారుల సమావేశాన్ని నిర్వహించిన నగరం?
   ఎ) సోచి(రష్యా) బి) ఫోర్టలెజా(బ్రెజిల్)
   సి) బీజింగ్(చైనా) డి) డర్బన్(దక్షిణాఫ్రికా)
40. ‘హంబంటోటా’ పోర్టులో 70 శాతం వాటాను ఏ దేశానికి విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయించింది?
   ఎ) ఫిలిప్పీన్ బి) ఇండియా సి) జపాన్ డి) చైనా

సమాధానాలు

1) సి	7) సి	13) ఎ	20) బి	27) సి	34) సి
2) డి	8) ఎ	14) డి	21) సి	28) సి	35) ఎ
3) బి	9) డి	15) బి	22) డి	29) బి	36) బి
4) సి	10) ఎ	16) డి	23) డి	30) డి	37) బి
5) డి	11) సి	17) బి	24) బి	31) బి	38) డి
6) సి	12) డి	18) సి	25) బి	32) ఎ	39) సి
		19) బి	26) డి	33) సి	40) డి

ఉద్యోగాలు

సింగరేణి కాలరీస్

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్- **బదిలీ వర్కర్ కేటగిరీ 1 (అండర్ గ్రౌండ్)** పోస్టుల భర్తీకోసం షెడ్యూల్డ్ తెగలకు చెందిన పురుషుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టులను తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకించారు.
మొత్తం ఖాళీలు: 665
అర్హత: పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: పదోతరగతి స్థాయిలో నిర్వహించే రాత పరీక్ష ద్వారా
మాధ్యమం: తెలుగు
వేతనం: రోజుకి రూ.604.33
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 7 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
చిరునామా: జి. ఎం(పర్సనల్), ద సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రిక్రూట్‌మెంట్ సెల్, కొత్తగూడెం కాలరీస్ - 507101, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లా, తెలంగాణ.
వెబ్‌సైట్: www.scclmines.com

ఇండియన్ నేవీ

కేరళ ఎజిమలాలోని ఇండియన్ నేవీ- ఎగ్జిక్యూటివ్& టెక్నికల్ బ్రాంచ్‌ల్లో షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్స్, నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్‌లో పర్మనెంట్ కమిషన్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకోసం ఇంజనీర్స్ నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టులకు సంబంధించిన కోర్సు 2018 జూన్ నుంచి ప్రారంభమవుతుంది.
ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ విభాగాలు: జనరల్ సర్వీస్/ హైడ్రోగ్రఫీ
టెక్నికల్ బ్రాంచ్ విభాగాలు: జనరల్ సర్వీస్/ నేవల్ ఆర్కిటెక్చర్
వయసు: అభ్యర్థులు 1993 జూలై 2 నుంచి 1999 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
అర్హత: 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఇంటిగ్రేటెడ్ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది చదువుతున్నవారు కూడా అర్హులే
ఎంపిక: అకడమిక్ మెరిట్, సర్వీస్ సెలెక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బి) ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ కేంద్రాలు: బెంగళూరు/ భోపాల్/ కోయంబత్తూరు, విశాఖపట్నం
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 5 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in


జిటిబిహెచ్


న్యూఢిల్లీలోని గురు తేజ్ బహదూర్ హాస్పిటల్ (జిటిబిహెచ్)- **జూనియర్ రెసిడెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 176(జనరల్ వర్గానికి 90, ఎస్సీలకు 26, ఎస్టీలకు 13, ఒబిసిలకు 47 పోస్టులను కేటాయించారు)
